
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టి శ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు

మంగళవారం 25 నవంబరు 2025



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న చేనేత కార్మికులు, బీజేపీ నాయకులు

సోమశిలకు కొనసాగుతున్న వరద

అనంతసాగరం నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వరద కొనసాగుతోంది. సోమవారం 15,573 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా, డ్యాంలో 74.398 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ ఉత్తర కాలువకు 500, డెల్టాకు 27,300, కండలేరుకు 750 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

● సంగం బ్యారేజ్‌కి పెరిగిన నీటి ప్రవాహం

సంగం (ఆంధ్రజ్యోతి) : సంగం బ్యారేజీకి వస్తున్న నీటి ప్రవాహం సోమవారం పెరిగింది. సోమశిల నుంచి 27వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం వచ్చి చేరుతోంది. దీంతో నీటిమట్టం 11 అడుగులకు స్థిరీకరించి పలు కాలువలకు నీటిని విడుదల చేస్తున్నారు. కనిగిరి రిజర్వాయర్ కాలువకు 700 క్యూసెక్కులు, కావలి



కాలువకు 700, కనుపూరు కాలువకు 410, నెల్లూరు చెరువు కాలువకు 130, దువ్వూరు కాలువకు 30, నెల్లూరు తాగునీటి పథకం ఇన్‌టెక్ వెల్‌కు 40 క్యూసెక్కులు చొప్పున విడుదల చేస్తున్నారు. మిగతా నీటిని 25 గేట్లు ఎత్తి దిగువ నెల్లూరు బ్యారేజ్‌కి వదిలేస్తున్నారు.

మా ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు!

అధికారుల తీరుపై చేనేతల ఆగ్రహం

కలెక్టరేట్ ఎదుట రాట్నాలతో ఆందోళన

'తుఫాన్ సాయం ఇవ్వకపోగా, బియ్యం కోసం మగ్గం గుంతలు నిర్మించారని అధికారులు తెలపడం దారుణం. మా ఆత్మగౌరవాన్ని వారు దెబ్బ తీశారు.' అంటూ సోమవారం చేనేత కార్మికులు ఆందోళన చేశారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ప్రకటించిన విధంగా తమకు తుఫాన్ సాయం అందించాలని వారు డిమాండ్ చేశారు.

వివరాలు 8లో..

ఆడపిల్లకి జై!

లింగ నిష్పత్తి (సెక్స్ రేషియో)లో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. మగ శిశు జననాల కంటే ఆడ శిశు జననాల రేటు గణనీయంగా పెరుగుతోంది. గతంలో ప్రతి వెయ్యి మంది మగ శివులకు 974 మంది ఆడ శిశువులు పుట్టేవారు. అయితే, సమాజంలో వచ్చిన మార్పులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సా హంతో ఈ నిష్పత్తిలో తేడా వచ్చింది. గత ఏడాది జిల్లాలో నేషనల్ ఫ్యామిలీ హౌస్‌హోల్డ్ సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్) జరగ్గా, ఇందులో 974 ఉన్న ఆడ శిశు జననాలు 1011లకు పెరిగినట్లు తేలింది. ఇది మంచి శుభపరిణామని మేథావులు చెబుతున్నారు.



లింగ నిష్పత్తిలో వినూత్న మార్పులు

మగ శిశువుల కంటే ఆడ శిశు జననాలే ఎక్కువ

నేషనల్ ఫ్యామిలీ హౌస్‌హోల్డ్ సర్వేలో స్పష్టత



ఇంటింటా సర్వే చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది (ఫైల్)

నెల్లూరు (వైద్యం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆడపిల్లల జననాల సంఖ్య పెరుగుతోంది. గతంలో దేశంలోనే కాకుండా రాష్ట్రస్థాయిలో మగ శిశు జననాల కంటే ఆడశిశు జననాల వ్యత్యాసం చాలా తక్కువగా ఉండేది. ప్రతి వెయ్యి మంది మగ శిశువుల పుడుతుండగా, ఆడ శిశువులు 974 మంది పుడుతున్నారు. గత ఏడాది ఆయా జననాలతో పోలిస్తే ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. మగ శిశువుల కంటే ఆడ శిశు జననాలు ఎక్కువగా నమోదయ్యాయి. ఆడ పిల్లల జననాల శాతాన్ని పెంచితే ఎంతో ప్రయోజనం ఉందని, స్త్రీలను పురుషులతో సమానంగా చూడాలని ప్రభుత్వ ఇస్తున్న పిలుపునకు అనుగుణంగా ఆడ శిశు జననాలు అనూహ్యంగా పెరిగాయి. కేరళాలో వెయ్యి మంది మగ శిశువులు పడుతుండగా 1084 మంది ఆడ శిశువులు జన్మిస్తున్నారు. ఇదొక రికార్డుగా సెక్స్ రేషియోపై కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇక రెండవ స్థానంలో పుదుచ్చేరి. ఇక్కడ మగశిశువు జననాల కంటే ఎక్కువగా 1038 ఆడ శిశు జననాలు ఉంటున్నాయి. మన రాష్ట్రంలో ప్రతి వెయ్యి మంది మగ శిశువుల జననాల కంటే ఎక్కువగా 1009 మంది ఆడ శిశులతో నాల్గవ స్థానంలో నిలిచినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇది నేషనల్ ఫ్యామిలీ హౌస్‌హోల్డ్ సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్) సర్వే స్పష్టం చేసింది. గత ఏడాది ఓ బృందం జిల్లాలో ఇంటింటికి తిరిగి సర్వే చేసింది. ఏడాది కాలంలో ఇంట్లో ఎన్ని జననాలు జరిగాయి. వారిలో మగ శిశువులు ఎంత మంది? ఆడ శిశువులు ఎందరు!? వారి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది తదితర విషయాలు సేకరించారు. ఈ సర్వే ప్రకారం మగ శిశువుల జననాల కంటే స్త్రీ శిశు జననాలు రేటు ఎక్కువగా నమోదయ్యింది. భ్రూణ హత్యలు నివారించాలన్న ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న చర్యలకు అనుగుణంగా ఈ ఫలితాలు వచ్చాయి.

● రాష్ట్రంలోనే నాల్గవ స్థానం

రాష్ట్రంలోని శ్రీకాకుళం జిల్లాలో మగ శివువుల జననాల కంటే ఆడ శిశువుల జననాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రతి వెయ్యి మంది మగ శిశువులు పడుతుంటే ఆడశిశువుల పుట్టుక 1163 మందికి చేరి మొదటి స్థానంలో నిలిచింది. కృష్ణా జిల్లాలో 1039 మంది, చిత్తూరు జిల్లాలో ఆడ పిల్లల జననాలు 1019లకు చేరి మూడవ స్థానంలో నిలిచింది. ఇక నాల్గవ స్థానం నెల్లూరు జిల్లాకు దక్కింది. ఇక్కడ వెయ్యి మంది మగ శిశువుల జననాల కంటే ఆడ శిశువులు జననాలు 1011లకు పెరిగింది. జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ చేపట్టిన చర్యల వల్లే ఇది సాధ్యమైంది. జిల్లాలో 197 స్కానింగ్ సెంటర్లు ఉండగా, ఇప్పటి వరకు 87 కేంద్రాలను తనిఖీ చేసి, గర్భస్థ శిశు నిర్థారణపై గట్టి చర్యలు తీసుకోవటం, ప్రజల్లో వచ్చిన మార్పుల కారణంగా ఈ జననాలు రేటు పెరిగింది.

మంచి శుభపరిణామం



జిల్లాలో ఆడశిశువుల జన నాలు పెరిగాయి. ఇది మం చి శుభ పరిణామం. జిల్లా లో ఉన్న స్కానింగ్ సెంటర్లను తరచూ ఆకస్మిక తని ఖీలు చేయటం, భ్రూణ హత్యలను నివారించటం వల్ల ఈ ఫలితాలు వచ్చాయి. పైగా ప్రభుత్వం కూడా స్త్రీ జననాల రేటును ప్రోత్సహించటం కూడా ఈ మార్పులకు కారణం.

- డాక్టర్ సుజాత,
జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి



డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఫైళ్లను పరిశీలిస్తున్న ఆడిటింగ్ బృందం

ఏ విభాగానికి ఎంత ఖర్చు చేశారు!?

నెల్లూరు (వైద్యం) నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సోమవారం ఏపీ స్టేట్ ఆడిటింగ్ బృందం ముమ్మరంగా తనిఖీలు చేపట్టింది. విజయవాడకు చెందిన సీనియర్ ఆడిటింగ్ అధికారి హుస్సేన్ అహ్మద్, అసిస్టెంట్ ఆడిటింగ్ అధికారి ప్రదీప్‌లు డీఎంహెచ్‌వో కార్యాలయానికి చేరుకుని జాతీయ ఆరోగ్య మిసన్‌కు సంబంధించి అన్ని ఖర్చుల వివరాలు సేకరిస్తున్నారు. ఏఏ విభాగానికి ఎంత ఖర్చు చేశారో ఆ వివరాలు సేకరిస్తున్నారు. వారం రోజులపాటు అన్ని ఖర్చులు, బడ్జెట్ వివరాలు పరిశీలించనున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కూడా వెళ్లి అక్కడ ఖర్చుల వివరాలను సేకరించనున్నారు. వీటి ఆధారంగా వైద్య ఆరోగ్యశాఖపై ఓ రిపోర్టు తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులకు నివేదించనున్నారు.

మేయర్‌గా స్రవంతి వద్దు!

- జేసీకి అవిశ్వాస లేఖను అందజేసిన కార్పొరేటర్లు
- స్రవంతి అవినీతిపైనా విచారణ చేయాలని డిమాండ్
- సొంత పార్టీలోనూ దక్కని మద్దతు

నెల్లూరు (సిటీ), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు మేయర్ పోట్లూరి స్రవంతిని ఆ పదవి నుంచి దించేయాలని కోరుతూ అధికార టీడీపీకి చెందిన ఇద్దరు డిప్యూటీ మేయర్లతో పాటు కార్పొరేటర్లు జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లుకు అవిశ్వాస లేఖ అందచేశారు. సోమవారం నెల్లూరురూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డితో తన కార్యాలయంలో భేటీ అయిన 40 మంది కార్పొరేటర్లు అక్కడ నుంచి బృందంగా కలెక్టరేట్‌కు వచ్చారు. ముందుగానే సంతకాలతో సిద్ధం చేసుకున్న లేఖను జేసీకి అందచేశారు. స్రవంతిని మేయర్ పదవి నుంచి తొలగించాలని, అందుకు అవిశ్వాస తీర్మాణం ప్రవేశపెట్టి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. తమ మద్దతును ఉపసంహరించుకుం టున్నట్లు స్పష్టం చేశారు. అనంతరం బయటకు వచ్చి డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. దేశ, రాష్ట్ర రాజకీయాల్లో ఎక్కడ, ఎప్పుడు జరగనంత అవినీతి మేయర్ స్రవంతి దంపతులు చేశారని తెలిపారు. భవన నిర్మాణాల్లో మార్టిగేజ్ విడుదల పత్రాల్లో ఏకంగా ఐఏఎస్ అధికారి సంతకాలనే ఫోర్జరీ చేసే స్థాయికి వారు వెళ్లారని ఆరోపించారు. గిరిజన మహిళ అయివుండి కూడా పారిశుధ్య కార్మికుల్లో గిరిజనులకు వారసత్వ ఉద్యోగాలు ఇవ్వడంలోనూ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. మరింత కాలం ఆమెను ఆ పదవిలో కొనసాగిస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని, కార్పొరేటర్లు తమ డివిజన్లలో తలెత్తుకు తిరగలేని దుస్థితి వచ్చిన నేపథ్యంలో



జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు

మంత్రి నారాయణ, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిలు మేయర్ పదవి నుంచి ఆమెను తొలగించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఆ మేరకు అవిశ్వాసం కోరుతూ లేఖ అందజేసినట్లు చెప్పారు. అనంతరం మరో డిప్యూటీ మేయర్ తహసీన్, కార్పొరేటర్లు మేయర్ అవినీతి పై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ, టీడీపీ నాయకులు విజయ భాస్కర్‌రెడ్డి, పట్టాభిరామిరెడ్డి, జలదంకి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

● వైసీపీలోనూ దక్కని మద్దతు

మేయర్ స్రవంతి తీరు పట్ల వైసీపీ జిల్లా నాయకత్వం మిన్నకుండిపోయింది. ఆమెకు తమ పార్టీ

- మిగతా 6లో..



బిట్రగుంట : బోగోలు మండలం వీఎన్‌ఆర్‌పేటలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

ఊరూరా 'రైతన్నా మీకోసం..'

జిల్లావ్యాప్తంగా రైతన్నా మీకోసం కార్యక్రమం అట్టహాసంగా సోమవారం ప్రారంభమైంది. వెంకటాచలం మండలం కనుపూరులో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఉలవపాడు మండలం పెద్దపట్టపుపాలెం గ్రామంలో ఇంటూరి నాగేశ్వరావు, వింజమూరు మండలం చంద్రపడియలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, నెల్లూరు రూరల్ మండలం మొగళ్ళపాళెంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోవూరు మండలం లేగుంటపాడులో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి జిల్లావ్యాప్తంగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఇంటింటా తిరుగుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.

- వివరాలు లోపలిపేజీల్లో

ఈసారి గోదాముల్లో..!

- ఉదయగిరిలో 200 టన్నుల రేషన్ బియ్యం పక్కదారి
- పూర్తిస్థాయి విచారణకు జాయింట్ కలెక్టర్ ఆదేశాలు
- ఎంత చేసినా ఆగని రేషన్ మాఫియా ఆగడాలు
- పౌరసరఫరాల శాఖలోనూ అంతే!

నెల్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పేదల బియ్యానికి రెక్కలు వస్తున్నాయి. ప్రతీ నెలా వేల టన్నుల పీడీఎస్ బియ్యం మాఫియా చేతుల్లోకి వెళుతుందన్నది బహిరంగ రహస్యం. ఇందుకు మండల స్థాయి స్టాక్ (ఎంఎల్ఎస్) గోదాములు, రేషన్ షాపులే కేంద్రాలుగా మారుతున్నాయి. ఉదయగిరి ఎంఎల్ఎస్ గోదాములో ఏకంగా 200 టన్నుల వరకూ రేషన్ బియ్యం మాయమవడం సంచలనం కలిగిస్తోంది. గోదాములో పనిచేసే సిబ్బంది ఇలా చేశారా!? లేక రేషన్ అక్రమార్కులు బరి తెగించారా..? అన్నది పక్కన పెడితే పేదల బియ్యం ఎంత దర్జాగా పక్కదారి పడుతోందో స్పష్టమవుతోంది. తిలాపాపం తలా పిడికెడు అన్నట్లుగా పౌరసరఫరాల శాఖ ఉద్యోగులు, రేషన్ మాఫియా కుమ్మక్కై రూ.కోట్ల పేదల బియ్యాన్ని బహిరంగ



సీల్ వేసిన ఉదయగిరి ఎంఎల్ఎస్ గోదాము

మార్కెట్లోకి తరలించి సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలకు ఈ ఘటన బలం చేకూరుస్తోంది. అయితే ఒక్క ఉదయగిరిలోనే ఇన్ని టన్నుల బియ్యం లెక్క తేలడం లేదంటే ఇక జిల్లాలోని మిగిలిన గోదాముల్లో పరిస్థితి ఏమిటన్నది చర్చనీయాంశంగా మారింది. ఉదయగిరి గోదాముకు అధికారులు సీల్ వేశారు. వచ్చే నెలకు అవసరమైన బియ్యం లారీల్లో ఆ గోదాముకు చేరుకోగా ఇప్పుడు అన్‌లోడ్ చేసుకునే పరిస్థితి కనిపించడం లేదు.

● అధికారుల్లో రాని మార్పు

ఇటీవల నెల్లూరులో ఐదు లారీల బియ్యాన్ని పట్టుకున్న అధికారులు అందులో రెండు లారీల్లో రేషన్ బియ్యం ఉన్నట్లు ప్రకటించారు. రాజకీయ ఒత్తిళ్లతో మిగిలిన మూడు లారీల్లో ఉన్న బియ్యం రేషన్ బియ్యం కాదని ప్రకటించారన్న విమర్శలున్నాయి. కూటమి పార్టీల్లోనే ఇది రాజకీయ చర్చకు దారి తీసింది. ఈ ప్రభావం రాష్ట్రస్థాయిలో కనిపించింది. ఏకంగా పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జోక్యం చేసుకొని అసలు నెల్లూరులో ఏం జరుగుతోందన్నది నివేదిక తెప్పించుకున్నారు. ఈ క్రమంలో అప్పటి జిల్లా

- మిగతా 7లో..

లెక్కల్లో తేడా వచ్చిన మాట వాస్తవమే

ఉదయగిరి ఎంఎల్ఎస్ పాయింట్లో బియ్యం లెక్కలపై విచారణ జరుగుతోంది. ప్రాథమిక నివేదిక ప్రకారం సుమారు 2 వేల బస్తాల వరకూ బియ్యం కనిపించడం లేదని తేలింది. పూర్తిస్థాయి విచారణ చేసి నివేదిక ఇవ్వాలని సివిల్ సప్లయిస్ డీఎంను ఆదేశించాం. ఆ నివేదిక ప్రకారం చర్యలు తీసుకుంటాం. అలానే జిల్లాలోని అన్ని గోదాముల్లో బియ్యం నిల్వలను పరిశీలించాల్సిందిగా ఆదేశాలిచ్చాం.

- ఎం వెంకటేశ్వర్లు,
జాయింట్ కలెక్టర్

ఆయిల్ పామ్‌కు రాయితీలు 8

1231 జాబ్‌కార్డుల తొలగింపు

ఉదయగిరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఉదయగిరి మండలంలోని 17 పంచాయతీల్లో 1,231 జాబ్‌కార్డులు తొలగించినట్లు ఎంపీడీవో బీ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. మండలంలో మొత్తం 14,631 జాబ్‌కార్డులు ఉండగా వాటిలో 9,721 జాబ్‌కార్డలకు ఈకేవైసీ పూర్తవ్వగా ఇంకా 3,679 జాబ్‌కార్డులకు ఈకేవైసీ చేయాల్సి ఉందన్నారు. ఈకేవైసీ విధా నం ద్వారా బినామీ మస్టర్లను పూర్తిగా నిరోధించడం జరుగుతుందన్నా రు. అందులో భాగంగా 1,231 జాబ్‌కార్డులు తొలగించినట్లు తెలిపారు.

నేడు పీహెచ్‌సీ ప్రారంభం

మనుబోలు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మనుబోలులో మంగళవారం నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. అలాగే రూ. 3 కోట్లతో నిర్మించనున్న ఎస్సీ బాలికల హాస్టల్‌కు భూమిపూజ కార్యక్రమంలో మంత్రి, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి పాల్గొంటారని ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు పొన్నూరు రామ కృష్ణయ్య సోమవారం తెలిపారు. అన్ని గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని వారు కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11788
వెండి కిలో ధర	రూ. 158200
వెండి ఒక గ్రాము	రూ. 163.20

వంద మంది ఉద్యోగుల భవిత ప్రశ్నార్థకం?

● 5 నెలలుగా అందని జీతాలు ● 12 సచివాలయాల్లో ఉద్యోగుల దుస్థితి ● ఉన్నతాధికారుల నివేదికలతోనే సరి...

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. వందమంది సచివాలయ ఉద్యోగుల పరిస్థితి గాలిలో దీపంలా మారింది. బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీ, రూరల్ పరిధిలోని 12 సచివాలయాలలో సుమారు 100 మంది ఉద్యోగులకు 5 నెలలుగా వేతనాలు అందలేదు. దీంతో తమ భవిత ప్రశ్నార్థకంగా, కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని బాధిత ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. రాష్ట్రంలో సచివాలయాల వ్యవస్థ ప్రారంభం నుంచి గత 5 నెలల క్రితం వరకు బుచ్చి మున్సిపాలిటీలో 10, రూరల్ పరిధిలోని 2 కలిపి మొత్తం 12 సచివాలయాల ఉద్యోగులకు రూరల్ పరిధిలోని 2 సచివాలయాల కార్యదర్శులు మాత్రమే డీడీఓలుగా సుమారు 100 మందికి జీతాలు ప్రభుత్వం నుంచి విడుదల చేసేవారు. అయితే 5 నెలల క్రితం బుచ్చి మున్సిపల్ కమిషనర్, మున్సిపాలిటీతోపాటు, రూరల్ పరిధిలోని 3 గ్రామ పంచాయతీలకు కట్టుబడిపాళెం సచివాలయాన్ని పూర్తిగా మున్సిపాలిటీలో విలీనం చేశారు. రూరల్ పరిధిలోని కట్టుబడిపాళెం, ఇస్కపాళెం సచివాలయాల కార్యదర్శుల డీడీఓ పవర్స్ (పొజిషన్ ఐడీ)ను సైతం రద్దు చేయించారు. దీంతో అప్పటి నుంచి నేటి వరకు 12 సచివాలయాల ఉద్యోగులకు జీతాలు లేక కుటుంబ పోషణ భారమైంది. ఎప్పుడు జీతాలు వస్తాయో తెలీక సుమారు వంద మంది ఉద్యోగులు నిరీక్షిస్తున్నారు.



బుచ్చి పురపాలక సంఘం పరిపాలనా భవనం, పక్కనే ఇస్కపాళెం, 2 సచివాలయం

● 'స్వయం రాజా..స్వయం మంత్రి' పోకడ

ఆ ఇద్దరి కార్యదర్శుల డీడీఓ పవర్స్ రద్దు విషయం కనీసం జిల్లాలోని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లకుండా 'స్వయం రాజా.. స్వయం మంత్రి' పోకడ ప్రదర్శిస్తున్నారు. 5 నెలలుగా జీతాలు లేక కుటుంబ పోషణకు అప్పులు చేసినా నాలుగు వేళ్ళు నోట్లోకి పోని పరిస్థితి ఉందని పలువురు సచివాలయాల ఉద్యోగులు వాపోతున్నారు. సచివాలయాల ఉద్యోగుల జీతాలకు సంబంధించి జిల్లా అధికారులకు నివేదిక పంపించేశామనిపించి క్షేత్ర స్థాయిలో అధికారులు చేతులు దులుపుకొన్నారు. అయితే గత 10 రోజుల క్రితం జిల్లా అధికారులు కూడా రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్, ఏపీ గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్, పురపాలకశాఖ కమిషనర్‌కు నివేదికలు పంపించినట్లు బుచ్చి మండలంలో ప్రచారం ఊపందుకుంటోంది. కానీ 10 రోజులైనా ఆ దిశగా ఎలాంటి పురోగతి కనిపించకపోవడంతో ఈనెల కూడా జీతాలొచ్చే పరిస్థితి లేదేమోననే నిరాశ సచివాలయాల ఉద్యోగుల్లో నెలకొంది.

● కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టి సారిస్తారా?

ఇక ఈ నెలలో అయినా తమ జీతాల సమస్య పరిష్కారం అవుతుందో లేదోనని వారు లోలోపలే మథనపడుతున్నారు. మరోవైపు అధికారుల తీరు ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చి పెట్టేదిగా ఉందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోరగా జీతాలు వస్తున్నాయని చెప్పడం గమనార్హం. ఇప్పటికైనా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, కలెక్టర్ చొరవ తీసుకుని వెంటనే తమకు వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సచివా లయాల ఉద్యోగులు కోరుతున్నారు.



పారిశుధ్యం, ఉపాధి పనులపై ప్రత్యేక దృష్టి

● కొలి వెంకటేశ్వర్లు, మండలాభివృద్ధి అధికారి

పారిశుధ్యం, ఉపాధి పనులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తోటపల్లిగూడూరు మండలాభివృద్ధి అధికారి కొలి వెంకటేశ్వర్లు 'ఆంధ్రజ్యోతి'తో పేర్కొన్నారు.

?. గ్రామాల్లో పారిశుధ్యం ఎలా ఉంది.

!. మండలంలోని ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్యం పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టి మెరుగుపరుస్తున్నాం. మురుగు కాలువలను పంచాయతీ సిబ్బందితో తరచూ పరిశుభ్రం చేయిస్తున్నాం.

?. ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా పేడ దిబ్బలు తొలగించారా..

!. గ్రామాల్లో రోడ్డు పక్కన పేడ దిబ్బలను తొలగించాం. పేడ దిబ్బలు వేసేవారికి నోటీసులు ఇచ్చాం. రోడ్డు పక్కన, పంచాయతీల్లో స్థలంలో దిబ్బలు వేస్తే చర్యలు తీసుకుంటున్నాం.

?. చెత్త సేకరణపై ఎలా అవగాహన కల్పిస్తున్నారు..

!. ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా గ్రామాల్లో చెత్తకుండీలు ఏర్పాటు చేశాం. ఆ కుండీలలోనే చెత్త వేయాలని సూచించాం.

?. ఉపాధి పనులపై అవినీతి లేకుండా ప్రత్యేక దృష్టి పెట్టారా

!. ఉపాధి పనులు ప్రతీ గ్రామంలో జరుగుతున్నాయి. ఎక్కడా ఎటువంటి అవినీతి లేకుండా ప్రత్యేక దృష్టి పెట్టి పని ప్రదేశాలను పరిశీలిస్తున్నాం. ప్రతీ కూలీకి కనీస వేతనం రూ. 270 అందేలా చూస్తున్నాం.

- తోటపల్లిగూడూరు, (ఆంధ్రజ్యోతి)

గిరిజనుల అభ్యున్నతికి వెన్నెలకంటి కృషి

●సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి) : గిరిజనుల అభ్యున్నతికి వెన్నెల కంటి రాఘవయ్య ఎనలేని కృషి చేశారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మో హన్ రెడ్డి కొనియాడారు. మండలంలోని గొలగమూడి వద్ద ఉన్న గురుకుల పాఠశాలలో సోమవారం స్వరాజ్య సంఘం స్థాపకుడు, స్వాతంత్ర్య పోరాటయోధుడు వెన్నెలకంటి రాఘవయ్య చిత్రపటానికి ఎమ్మెల్యే ఘనంగా నివాళులర్పించారు. వెన్నెలకంటి రాఘవయ్యతో తమ కుటుంబానికి ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. గిరిజనుల జీవితాల్లో మార్పు తేవడం అందరి బాధ్యత అన్నారు. రాఘవయ్యను నెల్లూరు గాంధీగా పిలుచుకుంటారన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

కుష్ఠు వ్యాధి సర్వే 30లోగా పూర్తి చేయాలి

అదనపు డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి

మనుబోలు, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి): కుష్ఠు వ్యాధిగ్రస్తుల నమోదు సర్వేను (ఎల్‌సీడీసీ) ఈనెల 30వ తేదీలోగా పూర్తిచేయాలని జిల్లా అదనపు వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. ఖాదర్‌వల్లీ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంతకు మునుపు నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీని పరిశీలించారు. అనంతరం చెర్లోపల్లిలోని గిరిజన కాలనీలో జరుగుతున్న కుష్ఠు సర్వేను ఆయన క్షేత్రస్థాయి పరిశీలన చేసి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు గేయపూజిత, సీహెచ్‌వో రాజయ్య, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న డా. ఖాదర్‌వలీ

శివాలయం హుండీ లెక్కింపు

పొదలకూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీకామాక్షితాయి శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానం (శివాలయం) ఆలయ హుండీ లెక్కింపు దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.శ్రీనివాస్‌బాబు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ హుండీ లెక్కింపులో 8నెలలకు గాను దేవస్థానానికి అక్షరాల రూ.2,29,368 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి ప్రసాద్‌రెడ్డి, ప్రధాన అర్చకులు ప్రసాద్‌స్వామి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సుధాకర్, ఆలయ అర్చకులు కుమారస్వామి, సిబ్బంది కుమార్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

27న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

ఉదయగిరి, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి): స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 27వ తేదీన ఉదయగిరి తాలుకా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి షేక్ మహ్మద్‌జావీద్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

మాజీ మంత్రి కాకాణిని అరెస్టు చేయాలి



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు మస్తాన్‌బాబు

పొదలకూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి గురించి అసభ్యకర పదజాలంతో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి కాకాణి గోవర్దన్ రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని సోమవారం సాయంత్రం పొదలకూరు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని సీఐ శివరామకృష్ణారెడ్డికి ఫిర్యాదు చేశారు. శాంతి భద్రతలకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేసిన కాకాణిని వెంటనే అరెస్టు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ మండలాధ్యక్షుడు, పీఏసీఎస్ చైర్మన్ మస్తాన్‌బాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే సోమిరెడ్డి అభివృద్ధి, సంక్షేమంపై దృష్టిపెట్టడం చూసి ఓర్వలేక కాకాణి బెదిరింపు ధోరణితో వ్యవహరిస్తున్నాడన్నారు. సొంత మండలాన్ని కాకాణి గాలికి వదిలేస్తే తమ నాయకులు రూ.1.50 కోట్ల సీఎస్ఆర్ నిధులు తీసుకొచ్చి పేదలకు ఉపయోగపడే డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఎస్సీ బాలికల వసతి గృహాల్లో అన్నీ సదుపాయాలు కల్పించారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో నాయకులు కలిచేటి ప్రభాకరరెడ్డి, బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, కోడూరు భాస్కర్‌రెడ్డి, పులిపాటి వెంకటరత్నం, జమీర్, బక్కనాయుడు, పి.కృష్ణ, అనీల్, అరుణమ్మ, సుగుణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కామాక్షితాయి ఆలయ భూముల వేలం

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయానికి చెందిన 4.42 ఎకరాల మాగాణి భూమికి సోమవారం నిర్వహించిన వేలం పాటల్లో ఏడాదికి 2లక్షలు రూపాయలు లీజుతో పాట దారులు దక్కించుకున్నారు. ఇటీవల ఆ భూమికి నిర్వహించిన వేలం నిర్వహణలో గతంలో జరిగిన అక్రమాలు బయటపడంతో వేలం వాయిదా వేసిన విషయం విదితమే. ఈమేరకు మళ్ళీ సోమవారం నిర్వహించిన వేలంలో 4.42 ఎకరాలకు లీజు రూ.2లక్షలకు పెరగడంతో గతంకన్నా సుమారు 70వేలు అధికంగా ఆదాయం వచ్చినట్టు తెలిపారు. అనంతరం పలు షాపులకు వేలంపాటలు నిర్వహించారు. మరో మెట్టభూమికి నిర్వహించాల్సిన వేలంకు వాయిదా వేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్ 1 ఈ.ఓ శ్రీధర్‌నాయుడు పాల్గొన్నారు. ఆలయ భూములకు సోమవారం నిర్వహించిన వేలంపాటల్లో పాల్గొన్న పలువురు పాటదారులు వేలం పాటలకు సంబంధించి అక్రమాలు బయటపడినా బాధ్యులపైన చర్యలెందుకు తీసుకోలేదని ఈఓ శ్రీనివాసులురెడ్డిని నిలదీశారు. ఆలయ ఆదాయానికి గండికొడుతున్నా ఎదుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. దీంతో పాటదారులు, ఈఓ మధ్య కొంతసేపు వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి.

క్రీడా దుస్తుల అందజేత



క్రీడా దుస్తులు అందచేస్తున్న పూర్వ విద్యార్థులు

ఇందుకూరుపేట, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఈదూరు జడ్‌ఆర్ఆర్ ఉన్నత పాఠశాల 2014-15 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఈదూరు పాఠశాల హిందీ ఉపాధ్యాయురాలు దివంగత మారుతీదేవి జ్ఞాపకార్థం రూ. 13,500 విలువ కలిగిన 30 క్రీడా దుస్తులను సోమవారం బహూకరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు ఈదూరు పాఠశాల 2014- 15 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు సీహెచ్ గిరీష్, కే సాయి కుమార్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు షేక్ ముజీర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఖరేశ్వర ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌గా నీలిమ

తోటపల్లిగూడూరు, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి): ప్రసన్న కామాక్షిదేవి సమేత ఖరేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్‌గా మన్నెం నీలిమ నియమితులయ్యారు. గతంలో తోటపల్లి గూడూరు గ్రామ సర్పంచ్‌గా ఆమె పనిచేశారు. తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే సోమిరెడ్డిని కలిసి నీలిమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మి సురేంద్ర, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొణతం రఘుబాబు, ప్రధాన కార్యదర్శి మన్యం జితేంద్రగౌడ్, మాజీ ఎంపీటీసీ మన్నెం మధుసూదన్, తెలుగు యువత మండలాధ్యక్షుడు గంగపట్నం సుధీర్, మధు, బాబు, తదితరులు పాల్గొన్నారు.

రామలింగారెడ్డి కుటుంబానికి పరామర్శ

తోటపల్లిగూడూరు, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని ఈదూరు గ్రామానికి చెందిన కోడూరు సుగుణమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. దీంతో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. సుగుణమ్మ మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు రామలింగారెడ్డి, సతీష్‌రెడ్డికి ధైర్యం చెప్పారు. నాయకులు పద్మనాభరెడ్డి, సుబ్రహ్మణ్యం గౌడ్, మధుసూదన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల సంక్షేమమే సీఎం చంద్రన్న లక్ష్యం

● ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

కోవూరు, నవంబరు 24, (ఆంధ్రజ్యోతి): అన్న దాతల సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని, రైతును రాజును చేసేందుకు ఆయన విశేష కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని లేగుంటపాడు గ్రామంలో 'రైతన్నా మీ కోసం' యాప్‌పై అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ఏపీఏఐ ఎం ఎస్ కరపత్రాలు పంపిణీ చేశారు. రైతులంద రికీ యూరియా అందుతోందా? అని అడిగి తెలుసుకున్నారు. కౌలు రైతులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. డిసెంబరు 3న రైతు లకు పంచ సూత్రాలపై అవగాహన కల్పించేందుకు వర్క్ షాపు నిర్వహిస్తున్నట్లు వివరిం చారు. ఈ కార్యక్రమంలో పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి, ఎంపీపీ తు మ్మలపెంట పార్వతి, సర్పంచు వేణుగోపాలరెడ్డి, టీడీపీ నాయకులు కోడూరు కమలాకరరెడ్డి, బెజవాడ వంశీకృష్ణా రెడ్డి, కొల్లారెడ్డి సుధాకర రెడ్డి, జెట్టి మదన్‌రెడ్డి, ఇంతా మల్లారెడ్డి, శ్యామ్‌సుందర రెడ్డి, దాసరి మురళీ మోహన్, యాకసిరి వెంకట రమణమ్మ, కరేటి అమరావతి, బాలా రవి, వ్యవసాయాధికారి అనిత పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి పూర్వ వైభవం: ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం : టీడీపీ ప్రభుత్వంలో వ్యవసాయ రంగానికి పూర్వవైభవం వచ్చిందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కనుపూరులో రైతన్నా.. మీ కోసం కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. పొలాలను పరిశీలించి రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో కీలకమైన పథకాలన్నింటిని మూలనపెట్టి ఏకంగా వ్యవసాయ శాఖనే మూతేశారని విమర్శించారు. అప్పుడూ ఇప్పుడూ అన్నదాతలకు నిరంతరం అండగా నిలబడుతున్నది చంద్రబాబు ఒక్కరేనన్నారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణమనాయుడు, రాధాకృష్ణారెడ్డి, నాగార్జునరెడ్డి, రమేష్ నాయుడు, మునుస్వామి, రవినాయుడు, వంశీకృష్ణ, హిమల్ కుమార్‌రెడ్డి, అమర్నాథ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: వ్యవసాయంలో రైతులను సాంకేతికంగా చైతన్యవంతం చేయాలనే లక్ష్యం తో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 'రైతన్నా మీకోసం' యాప్‌పై సోమవారం అన్ని గ్రామ పంచాయ తీల్లో మండల వ్యవసాయాధికారి పర్యవేక్షణలో అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి ఎన్. శ్రీహరి మాట్లాడుతూ గ్రామాల్లో రైతు సదస్సులు నిర్వహించి ప్రభుత్వ పథకాలు, నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రి టెక్, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల రైతు విభాగం అధ్యక్షుడు పెనాక అమర్నాథ రెడ్డి, రైతులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మనుబోలు: ప్రభుత్వం సూచించిన పంచ సూత్రాలు పాటిస్తే రైతే రాజు అయ్యే అవకాశం ఉంటుందని మండల వ్యవసాయాధికారి వెంక టకృష్ణయ్య అన్నారు. మనుబోలులో సోమవారం రైతన్నా.. మీకోసం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికి వెళ్ళి వ్యవసాయాధికారులు కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మ నుబోలు నీటిసంఘం అధ్యక్షుడు పచ్చిపాల రామిరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ సాని వెంకట రమణయ్య, నాయకులు శివుడు రాజాగౌడ్, చే రెడ్డి పద్మనాభరెడ్డి, పెనుబాక మహేష్, వీపీఏ శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముత్తుకూరు : రైతును రాజు చేసే లక్ష్యంతో ప్రభుత్వం రైతన్నా.. మీ కోసం' యాప్‌ను రూపొందించిందని జిల్లా వ్యవసాయాధికారిణి పీ. సత్యవాణి పేర్కొన్నారు. పిడతాపోలూరు గ్రామంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని, రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ప్రభుత్వం వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం చేపడుతున్న పథకాలపై అవగాహన కల్పించారు. ఈనెల 29వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సహాయ వ్యవసాయ సంచాలకులు నర్సోజీ, వ్యవసాయాధికారిణి జ్యోత్స్న రాణి, నీటి పారుదల సంఘం అధ్యక్షుడు సురేష్ రెడ్డి, వ్యవసాయ సహాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి

పొదలకూరు : ముదిగేడులో సోమవారం టీడీపీ నాయకులు సచివాలయ సిబ్బందితో కలిసి 'రైతన్నా మీ కోసం' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి రైతులకు కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ హేమలత, వెటర్నరీ అసిస్టెంట్ షేక్ రేష్మ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వై అశోక్‌రాజు, గ్రామ టీడీపీ నాయకులు మాలపాటి భాస్కర్‌రెడ్డి, మండి యానాది రెడ్డి, వెన్నపూస నారాయణరెడ్డి, ఎనిమిరెడ్డి ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లిగూడూరు : మండలంలోని అన్నీ రైతు సేవా కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో రైతన్న.. మీకోసం' కార్యక్రమం నిర్వహించారు. వరిగొండలో మండల వ్యవసాయాధికారిణి శిరీష రాణి, గ్రామ వ్యవసాయ, మత్స్య, పశు సంవర్థక సహాయకులు ఇంటింటికీ వెళ్లి రైతులకు యాప్‌పై అవగాహన కల్పించారు.

C.R.I.M.E N.E.W.S

అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్ల అరెస్ట్

● కొంత నగదు రికవరీ ● మరికొంత ఫ్రీజింగ్
● కేసు ఛేదించిన సిబ్బందికి ఎస్పీ అభినందనలు



ఎస్పీ అజిత నుంచి ప్రశంసలు అందుకున్న పోలీసు సిబ్బంది

నెల్లూరు(క్రైం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అంతర్‌రాష్ట్ర సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేసి నగదు రికవరీతోపాటు ఖాతాలోని నగదును ఫ్రీజింగ్ చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల సోమవారం అభినందించారు. అనంతరం ప్రశంసాపత్రాలు అందజేశారు. కావలిలోని ఓ వ్యక్తికి ఆర్టీవో చలానా పేరుతో ఏపీకే ఫైల్ పంపించి, అతని ఖాతాలోని సుమారు రూ.24 లక్షల నగదును సైబర్ నేరగాళ్లు దోచేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఒకటవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు సాంకేతికత ఆధారంగా నిందితులు జార్ఖండ్ రాష్ట్రం జంతారా జిల్లా కర్మాటూర్ పోస్ట్ తేబుల్‌బంద గ్రామానికి చెందిన వివేక్‌కుమార్ మండల్, హేత్ కర్మాటూరు గ్రామానికి చెందిన రాకేష్‌కుమార్ మండల్, సంజయ్ మండల్‌గా గుర్తించారు. కావలి నుంచి ప్రత్యేక బృందం ఈనెల 14న జార్ఖండ్ జాంతారాలో నిందితులను అదుపులోకి తీసుకుని అక్కడి కోర్టులో హాజరు పరిచారు.అనంతరం ఈనెల 18న కావలి కోర్టులో హాజరుపరచగా, న్యాయాధికారి రిమాండ్ విధించారు. కోర్టు అనుమతితో పోలీసులు ఈనెల 20న నిందితులను పోలీసు కస్టడీకి తీసుకున్నారు. వారిని విచారించి, వారి వద్ద నుంచి రూ.21.90 లక్షల నగదు, సెల్‌ఫోన్, బ్యాంక్ ఖాతాలోని రూ.1,23,855 నగదును ఫ్రీజ్ చేశామని ఎస్పీ తెలిపారు. నాలుగు రోజుల కస్టడీ ముగియడంతో కోర్టులో నిందితులను హాజరుపరిచి, వారిని రిమాండ్‌కు తరలించామన్నారు. కేసును ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనపరిచిన కావలి ఒకటోపట్టణ ఇన్‌స్పెక్టర్ ఎండీ ఫిరోజ్, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఏ. వెంకటేశ్వర్లు, కావలి ఎస్ఐ ఎస్ సుమాన్, సైబర్ క్రైమ్ సిబ్బంది పీ. శ్రీనివాసుల రెడ్డి, రవీంద్ర, కావలి సిబ్బంది వీ. మధుసూదన్, శ్రీరామ్, శ్రీహరి, శివకుమార్‌లను ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు నిందితుల బైండోవర్

నెల్లూరురూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇటీవల సింగవరం మహేష్ అనే వ్యక్తిపై దాడికి పాల్పడి, చంపేస్తామంటూ బెదిరించిన ముగ్గురు నిందితులను రూరల్ పోలీసులు రూరల్ తహసీల్దారు కృష్ణప్రసాద్ ఎదుట సోమవారం హాజరుపరిచారు. మహేష్‌ను ఆటోలో తీసుకెళ్లి రాజుపాళెం వద్ద చంపేస్తామంటూ బెదిరించిన వారిలో వికీష్, వంశీ, మోహన్‌లున్నారు. మరోసారి నేరాలకు పాల్పడితే ఒక్కొక్కరికి రూ. 5లక్షల చొప్పున జరిమానా విధిస్తామని తహసీల్దారు వారిని హెచ్చరించినట్లు పోలీసులు తెలిపారు.

ఆటో మిస్సింగ్‌పై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వెంకటరమణ హోటల్ సమీపంలో నిలిపిన ఆటో కనిపించలేదని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిన్నబజారు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. కాగితాలపూరుకి చెందిన జుకఫ్‌ఖార్‌అలి నెల్లూరులో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఈనెల 22న మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఏపీ 39డబ్ల్యూఎఫ్0917 నెంబరు కలిగిన తన ఆటోను వెంకటరమణ హోటల్ సమీపంలో పార్క్ చేసి, హోటల్‌లోకి టిఫిన్ చేసేందుకు ఆలి వెళ్లారు. తిరిగి వచ్చి చూడగా ఆటో కనిపించలేదు. చుట్టుపక్కల గాలించినా ప్రయోజనం లేకపోవడంతో సోమవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పి కారు బోల్తా

● త్రుటిలో తప్పిన ప్రమాదం



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

ఉదయగిరి, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని శకునాలపల్లి గ్రామ స మీపంలో కారు అదుపు తప్పి బోల్తాపడడంతో త్రుటిలో ప్రమాదం త ప్పిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసు కొంది. వివరాల మేరకు.. పుల్లాయపల్లి గ్రామానికి చెందిన కొందరు యువకులు కారులో యర్రబల్లిగడ్డ సెంటర్‌కు వస్తుండగా శకునాల పల్లి గ్రామ సమీపాన రాగానే ఒక్కసారిగా కారు అదుపుతప్పి గుం తలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయా ణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు.

మోటారు బైక్ మాయంపై ఫిర్యాదు

సంగం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి: మండలంలోని తరుణవాయి రోడ్డు సమీపంలో ముంబాయి రహదారి పక్కన నిలిపిన మోటారు బైక్ మాయంపై సోమవారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల మేరకు.. వై వంశీ అనే యువకుడు ఏపీ 39 ఎఫ్ఎం 1315 నెంబరు గల మోటారుబైక్‌ను రోడ్డు పక్కన నిలిపి పొలంలో పనికి వెళ్లాడు. పొలం పనులు ముగించుకుని మధ్యాహ్నం ఇంటికి వచ్చేందుకు బైక్ పెట్టిన చోటకు రాగా అప్పటికే బైక్ లేదు. దీంతో చోరీకి గురైందని భావించి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అనధికార మద్యం దుకాణంపై దాడి

ఉదయగిరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్రపల్లి బీసీ కాలనీలో నిర్వహిస్తున్న అనధికార మద్యం దుకాణంపై సోమవారం ఉదయగిరి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ దీప్తికరంత్ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఏడు మద్యం సీసాలతోపాటు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

మేయర్‌గా స్రవంతి వద్దు!

(5వ పేజీ తరువాయి)

నుంచి ఎలాంటి మద్దతు ఇవ్వకూడదన్న సంకేతాలు నేతల్లో వ్యక్తమయ్యాయి. స్రవంతిపై కార్పొరేటర్లంతా తిరుగుబాటు చేసి ఆమెను పదవి నుంచి తొలగించాలని కోరుతు జేసీకి అవిశ్వాస లేఖను అందచేసిన నేపథ్యంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డిలు నెల్లూరులోని ఆపార్టీ కార్యాలయంలో సమావేశమయ్యారు. విశ్వసనీయ సమాచారం మేరకు ప్రస్తుతం మే యర్ తమ పార్టీలో లేనందున తాజా పరిణామాలపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం ఉత్తమమని వారంతా నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవల డిప్యూటీ మేయర్ ఎన్నిక సమయంలో మేయర్ స్రవం తి ఓటు హక్కును వినియోగించుకోవడంలో గైర్హాజరవడంపై వైసీపీ నాయకులు సీరియస్‌గా ఉన్నారు. ఈ నేపథ్యంలో అవిశ్వాసంలోనూ పట్టించుకోకూడదన్న వాదనకు వచ్చినట్లు సమాచారం.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	126
స్కిన్ చికెన్	228
స్కిన్‌లెస్	252
కోడిగుడ్ల ధర (100):	660



వైభవంగా మండల పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం మండల పూజలు వైభవంగా జరిగాయి. తొలుత అయ్యప్పస్వామికి నిర్మాల్య దర్శనం, పాలాభిషేకం, మహాగణపతి హోమం, ఉషఃపూజ, శ్రీవేలి ఉత్సవం, కలశపూజ, నవకాభిషేకం, ఉచ్ఛపూజ, సాయంత్రం పూలంగిసేవ, దర్శనం, మహాదీపారాధన, భగవతి సేవ, అత్తాళపూజ జరిగాయి. అన్న ప్రసాద వితరణకు వేలూరు హరినాథ్‌రెడ్డి, గిరిజమ్మ, వేలూరు శివ, సునీల్‌రెడ్డి, సుధ నెల్లూరు దశరధరామిరెడ్డి, హైమావతమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

కార్పొరేషన్ పీజీఆర్‌ఎస్‌కు 42 వినతులు

నెల్లూరు(సిటీ), నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : నగర కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు 42 మంది తమ సమస్యలపై వినతులు అందించారు. వీటిని డీసీ చెన్నుడు స్వీకరించి, పరిష్కరించాలని వివిధ విభాగాలకు పంపారు. ఇందులో టిడ్కో, సిటీప్లానింగ్, రెవెన్యూ ఇంజనీరింగ్, ఆప్కాస్ విభాగాలకు చెందిన వినతులున్నాయి. కాగా 26, 27 తేదీల్లో కస్తూర్బా కళాక్షేత్రంలో నిర్వహించే వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులను సచివాలయ ఉద్యోగులతోపాటు కళాశాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

కోలాటంలో శిక్షణ

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని గాంధీనగర్ కృష్ణమందిరంలో నెలపాటు కోలాటం శిక్షణ ఇస్తామని, ఆసక్తి గల భక్తులు పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు సోమవారం ఓ ప్రకటనలో కోరారు. తరగతులు డిసెంబరు 16 నుంచి జనవరి 14 వరకు ప్రతిరోజు సాయంత్రం ఆలయంలో జరుగుతాయన్నారు. మంగళవారం సాయంత్రం 5.30గంటలకు ఆలయం దగ్గరికి వచ్చి వివరాలు తెలుసుకోవాలన్నారు. వివరాలకు 95028 08181 నంబరును సంప్రదించాలన్నారు.

ఇప్పుడైనా నిజాయితీగా ఉండవయ్యా... : సోమిరెడ్డి

నెల్లూరు (వైద్యం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : 'గత సార్వత్రిక ఎన్నికలకు ముందు సిద్ధం సిద్ధం... అంటూ జగన్మోహన్‌రెడ్డి ఫొటోలు, వీడియోలు పెట్టి ఒకటే హడావిడి చేశారు... వైనాట్ 175 అన్నారు. ప్రజలు ఎలాంటి తీర్పు ఇచ్చారో తెలిసింది. ఇకనైనా కాస్త నిజాయితీగా ఉండయ్యా ' అంటూ వైసీపీ నేత జగన్‌కు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో హితవు పలికారు. ఇంకా జగన్ మారలేదని, భ్రమలో ఉండి రాజకీయాలు చేస్తున్నారన్నారు. ప్రజలను మళ్లీ మోసం చేయాలని చూస్తున్నారని పేర్కొన్నారు. కోర్టుకు, పెళ్లికి, చావుకు వెళితే జనం వచ్చారని చెప్పుకుంటూ తనపై ప్రజా వ్యతిరేకత తగ్గిందని డబ్బా కొట్టేకుంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో కాస్త నిజాయితీగా వ్యవహరించాలని కోరారు.

బస్సు ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలి

● ఆర్టీవో మురళీధర్

కావలి రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): బస్ ప్రమాదాల నియంత్రణ పట్ల పాఠశాలలు, కళాశాలల యజమానులు, డ్రైవర్లు అవగాహన కలిగి ఉండాలని ఆర్టీవో మురళీధర్ పేర్కొన్నారు. పట్టణ సమీపంలోని ముసునూరు టోల్ ప్లాజా వద్ద సోమవారం అగ్నిప్రమాదాల నియంత్రణ కు తీసుకోవాల్సిన చర్యలపై, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకంపై వాహనదారులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్టీవో మాట్లాడుతూ బస్‌ల్లో అగ్ని ప్రమాదాల నియంత్రణ కిట్లతో పాటు మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని, ఎమర్జన్సీ డోర్లు పని చేసేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, బస్‌ల్లో ప్రయాణించే విద్యార్థులకు అగ్నిప్రమాదాల నియంత్రణ కిట్ల వాడకం, ప్రమాదాల సమయంలో ఎమర్జనీ డోర్ల వాడకంపై అవగాహన కల్పిస్తుండాలని సూచించారు. పాఠశాలల బస్‌లు తనిఖీ చేసి ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు సుందరరావు, అసిస్టెంట్ ఎంవీఐలు కరుణాకర్, లక్ష్మీభాయ్, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

కావలి(టౌన్), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణ పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీలో సోమవారం జేబీ ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం, మాదక ద్రవ్యాల వాడకంపై అవగాహన సదస్సు జరిగింది. రెండవ పట్టణ ఎస్‌ఐ గౌస్‌బాషా మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాలు దుష్పరిమాణాల గురించి వివరించారు. డాక్టర్లు వెంకటేశ్వర్లుబాబు, మహేష్, మోహన్, మేఘనాథ్‌లు పాల్గొని కంటి వైద్యం, దంత ఆరోగ్యం, మధుమేహం, రక్తపోటు, సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేబీ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం నాయుడు, స్వయం ఉపాధి కోర్సుల సంచాలకులు మాల్యాద్రి, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్లు నాగేశ్వరరావు, అయూబ్, రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్ రెడ్డి, పీడీ ప్రసాద్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



రోడ్డుకు అడ్డంగా నిలబడిన ఆవులు

నడిరోడ్డే.. మా అడ్డా..!

నెల్లూరు(విద్య), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాత్రిళ్లు వాహనదారులు, చిరువ్యాపారులు పనులు ముగించుకుని హడావిడిగా ఇళ్లకు వెళ్లే సమయంలో బుజబుజనెల్లూరు వాసులుకు ప్రతిరోజూ ఆవులు, గేదెల సమస్య వేధిస్తోంది. సరిగ్గా రోడ్డు మధ్యలో పశువులు తిష్టవేసి వచ్చే పోయే వాహనాలకు స్పీడు బ్రేకర్లుగా మారాయి. వీటిని తప్పించుకుని పోవాలంటే ప్రజలకు గగనమవుతోంది. రోడ్ల మధ్యలో ఇవి గంటల తరబడి నిలబడడం, పడుకోవడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. రాత్రి సమయాల్లో వాహనాలు దగ్గరకు వచ్చే వరకు రోడ్డుపై పశువులు పడుకున్నవి అర్థం కావడం లేదు. అనేకమార్లు వీటిని ఢీకొని ప్రమాదాలు జరిగిన ఘటనలు కూడా ఉన్నాయి. రోడ్డు మీదకు ఆవులు, గేదెలను వదిలితే చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేసే కార్పొరేషన్ అధికారులు, వాటిని అమలు చేయడంలో మాత్రం విఫలమవుతున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో రోడ్లపైనే పశువులు యథేచ్ఛగా తిరుగుతున్నాయి.

రూరల్ ప్రాంతమంతా త్రీఫేస్ కరెంట్

● రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్



స్విచ్ వేసి త్రీ ఫేస్ విద్యుత్ సరఫరాను ప్రారంభిస్తున్న రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, నాయకులు

నెల్లూరు రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : త్రీ ఫేజ్ కరెంట్ సరఫరాను నెల్లూరు రూరల్లో దాదాపుగా పూర్తి చేశామని రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని మొగళ్లపాళెంలో స్విచ్ఛాన్ చేసి త్రీ ఫేస్ కరెంట్ సరఫరాను ప్రారంభించారు. రూరల్లో 26 ప్రాంతాల్లో త్రీ ఫేస్ విద్యుత్ సరఫరాను 24 గంటలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు పనులు ప్రారంభం కాగా, 19 ప్రాంతాల్లో ఇప్పటికే అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. ఇక ఏడు ప్రాంతాల్లో తుది దశలో ఉందన్నారు. రాష్ట్రంలోనే మొట్టమొదటగా నెల్లూరురూరల్లో త్రీ ఫేస్ కరెంట్ సరఫరాను 24 గంటల పాటు అమల్లోకి తీసుకొచ్చామని చెప్పారు.

● రైతన్నా... మీకోసం....

అదే గ్రామంలో రైతన్న మీకోసం... కార్యక్రమాన్ని స్థానిక రైతులతో కలిసి సోమవారం ఆయన నిర్వహించారు. ఎరువులు సైతం అన్నదాతలకు దగ్గరగా ఉన్నాయని తెలిపారు. అనంతరం గ్రామానికి చెందిన ఉబ్బల శంకరయ్య, మల్లయ్యల మిత్రబృందానికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ రాపూరు చంద్రశేఖర్, గుండ్లపాళెం సొసైటీ చైర్మన్ పముజుల ప్రదీప్, ఎంపీపీ విజయకుమార్, ఎమ్మెల్యే కార్యాలయ ఇన్‌చార్జి వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, నాయకులు శ్రీనివాసులురెడ్డి, జలదంకి సుధాకర్ పాల్గొన్నారు.

బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి



కలెక్టరేట్ ప్రాంగణంలో శ్రీహరిరావు, నర్మదాబాయి తదితరులు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు సోమవారం పీజీఆర్‌ఎస్‌లో జేసీకి వినతిపత్రం సమర్పించారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు పలమాల శ్రీహరిరావు మాట్లాడుతూ రాష్ట్రంలో జనగణనతోపాటు సమగ్ర కులగణనను తక్షణమే నిర్వహించాలన్నారు. ప్రతీ కుటుంబానికి సంబంధించి సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులన్నింటినీ తెలుసుకునేలా మొత్తం వివరాలను సమగ్రంగా సేకరించాలన్నారు. రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీ రిజర్వేషన్లను ఏబీసీడీలుగా వర్గీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం మహిళా అధ్యక్షురాలు నర్మదబాయి, రాష్ట్ర కార్యదర్శి ముంగర శైలజ, ఉపాధ్యక్షుడు ఎస్‌కే సలీం, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ఖాజన వెంకటశేషయ్య, తరుణ్‌సింగ్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

వెన్నెలకంటి ఆశయ సాధనకు కృషి చేయాలి



వెన్నెలకంటి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ప్రసాద్, రాజేశ్వరమ్మ

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించిన వెన్నెలకంటి రాఘవయ్య ఆశయ సాధన కోసం యువత కృషి చేయాలని ఏపీ రాష్ట్ర ఆదిమజాతి సేవ సంఘం ట్రస్ట్ బోర్డు మేనేజింగ్ ట్రస్టీ పీఎల్ ప్రసాద్ అన్నారు. సోమవారం నగరంలోని వెన్నెలకంటి రాఘవయ్య భవన్‌లో వెన్నెలకంటి 44వ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ ఇతర నాయకులు వెన్నెలకంటి విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతికి చివరి శ్వాసవరకు వెన్నెలకంటి శ్రమించారని చెప్పారు. అనాథలైన యానాదుల కోసం ఆయన చేసిన పోరాటాలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య, ట్రస్ట్‌బోర్డు సభ్యులు రాజేశ్వరమ్మ, పీ లావణ్య, గంధళ్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

శభాష్ నాగార్జున !

● కానిస్టేబుల్‌కు ఎస్పీ అభినందన



కానిస్టేబుల్ నాగార్జునను అభినందిస్తున్న ఎస్పీ

నెల్లూరు(క్రైం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగడం గమనించి బస్సు ఆపి ప్రయాణికులను సురక్షితంగా రక్షించిన కానిస్టేబుల్ నాగార్జునను ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అభినందించారు. ఈనెల 18 సాయంత్రం సంగం సమీపంలో కానిస్టేబుల్ నాగార్జున విజిబుల్ పోలీసింగ్ చేస్తుండగా, ఆత్మకూరు నుంచి నెల్లూరు వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ముందు భాగంలో మంటలు రావడాన్ని గమనించాడు. వెంటనే నాగార్జున బస్సును నిలిపి 45 మంది ప్రయాణికులను సురక్షితంగా దింపారు. కానిస్టేబుల్ చురుకుదనం, ధైర్యాన్ని ఎస్పీ అభినందించి రివార్డు అందజేశారు.

నిరుద్యోగులకు న్యాయం చేయండి



తెలుగుగంగ ఎస్‌ఈకి వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

నెల్లూరు(స్టోన్ హౌస్‌పేట), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ ముంపు ప్రాంతాల నిరుద్యోగులు వృద్ధులు కాకముందే ఉద్యోగం ఇస్తారా.. లేక పరిహారం మంజూరు చేస్తారా..? నిర్ణయించాలని బీజేపీ నమామీ గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ పేర్కొన్నారు. హైకోర్టు తీర్పును గౌరవించి, మూడో జాబితాను తయారు చేయాలని తెలుగుగంగ ఎస్‌ఈ సుబ్రహ్మణేశ్వర శర్మకు ఆయన కార్యాలయంలో సోమవారం బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ కండలేరు భూనిర్వాసితుల్లో సుమారు 1500 మంది తమ అవార్డులను ఉద్యోగుల జాబితాలో చేర్చుకోలేక పోయారన్నారు. జీవోల ప్రకారం అవార్డు పొందిన సంవత్సరం లోపు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలన్న నిబంధనలపై హైకోర్టు డివిజనల్ బెంచ్ తుదితీర్పు ప్రకటించిందని గుర్తు చేశారు. అవార్డుదారులకు వెంటనే ఉద్యోగాలు ఇస్తారో... పరిహారం ఇస్తారో... నిర్ణయం తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకురాలు కందికట్ల రాజేశ్వరి, సరాల సుబ్బారెడ్డి, నీలిశెట్టి లక్ష్మణరావు, బుధవారపు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులకు జోనల్ చైర్మన్ పరామర్శ



మెకానిక్‌ను డాక్టర్‌కు చూపిస్తున్న సురేష్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్ హౌస్‌పేట), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో ప్రమాదానికి గురైన ఆర్టీసీ అవుట్ సోర్సింగ్ కార్మికులను నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి నగరంలోని జయభారత్ వైద్యశాలలో సోమవారం పరామర్శించారు. నెల్లూరు-2వ డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు రాజుపాలెం వద్ద సోమవారం బ్రేక్‌డౌన్ అయింది. బస్సుకు మరమ్మతులు చేసేందుకు ఘటనా స్థలానికి మెకానిక్‌లు మస్తాన్, శివశంకర్ వెళ్లారు. బస్సు రిపేరు చేస్తుండగా అనూహ్యంగా వెనకకు కదలడంతో ఇద్దరు మెకానిక్‌లు ప్రమాదానికి గురయ్యారు. సమాచారం అందుకున్న సురేష్‌రెడ్డి వారిని చికిత్స నిమిత్తం జయభారత్ వైద్యశాలలో చేర్పించి చికిత్స అందించారు. ప్రమాదానికి గురైన వారిని పరామర్శించి, వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

ఏపీఎస్‌జీఆర్‌ఈఏలో నూర్‌బాషా సంఘం నేతల చేరిక



ఏపీఎస్‌జీఆర్‌ఈఏలో చేరిన షేక్ కాలేషా

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఏపీ రాష్ట్ర నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ కాలేషా సోమవారం ఏపీ స్టేట్ గవర్నమెంటు రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్(ఏపీఎస్‌బీఆర్‌ఈఏ)లో చేరారు. ఏపీఎస్‌జీఆర్‌ఈఏ జిల్లా అధ్యక్షుడు ఐ. లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎన్.నళినీమోహన్ సమక్షంలో ఆయన చేరారు. ఈ సందర్భంగా ఆయనకు ఐ.లక్ష్మీనారాయణ శుభాకాంక్షలు తెలిపారు.

ఫినిష్

● పడిపోయిన చేపల ధరలు ● చిక్కిపోతున్న మత్స్య సాగు

● రైతుల వద్ద కిలో రూ.84కి.. ● పెట్టుబడేమో రూ.100 పైమాటే...

● వ్యాపారుల సిండికేట్‌తో ప్రశ్నార్థకంగా సాగు



ఎగుమతికి సిద్ధం చేస్తున్న రూప్‌చంద్ చేపలు

నెల్లూరు రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా నుంచి ప్రభుత్వానికి జీడీపీని అందించేది మొదటగగ వ్యవసాయ రంగం. రెండవస్థానంలో ఉన్న ఆక్వా కల్చర్‌లో చేపల సాగు ప్రముఖంగా ఉంది. అత్యధికమంది రైతులు తమ పొలాల్లో గుంటలు తయారు చేసి చేపలను సాగుచేస్తు దేశీయంగా ఉన్న అంతర్గత మార్కెట్లకు ఎగుమతి చేస్తున్నారు. నెల్లూరురూరల్ ప్రాంతంలోని రైతులు ఇందులో కీలకంగా వ్యవహరిస్తున్నారు. చేపలను సాగు చేస్తున్న రైతులకు చేదు అనుభవం ఎదరవుతుంది. చేపల కొనుగోలు వ్యాపారులంతా సిండికేటై ధరలను ఘననీయంగా తగ్గించేశారు. దీంతో పెట్టుబడి ఖర్చు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. కేజీ చేపను సాగు చేసేందుకు రూ.100 వరకు ఖర్చవుతుండగా అదే చేపను కేజీ రూ.84కు కొనుగోలు చేస్తున్నారు. దీంతో చేపల సాగు తాజాగా ప్రశ్నార్థకంగా మారింది.

● అత్యధికంగా రూప్‌చంద్ సాగు

బంగ్లాదేశ్‌లో పురుడు పోసుకుంటున్న రూప్‌చంద్ చేప జిల్లాలో కీలక భూమిక పోషిస్తుంది. అత్యధిక రైతులు ఈ జాతికి చెందిన చేపలనే సాగు చేస్తున్నారు. అక్కడ్నుంచి చిన్న పిల్లలు (స్పాన్)ను కలకత్తాకి తీసుకువచ్చి ఆపై కైకలూరు ఇతర మార్కెట్ల ద్వారా నెల్లూరుకు చేరుతుంది. ఒక్కొక్క దాని ధర 70 పైసల నుంచి రూపాయి వరకు ఉంది. ఆరు నెలల పాటు మేత, మందులు, కరెంట్ ఖర్చులు భరించి కేజీ సైజుకు తీసుకువస్తున్నారు. ఆపై వ్యాపారులకు అమ్మేస్తున్నారు. ఈ సుదీర్ఘ ప్రక్రియలో రైతు ఒక్కో చేప పై రూ. 100ల వరకు ఖర్చు చేస్తున్నారు. తీరా అమ్మే సమయానికి వ్యాపారులు కేజీ రూ. 84లకే కొనుగోలు చేస్తున్నారు. లేదంటే తమకు వద్దని వదిలేస్తున్నారు. దీంతో చేపలకు పెట్టుబడులు పెట్టలేక సాగురైతులు వచ్చిన కాడికి తెగ నమ్ముకుంటున్నారు. కేజీ చేపపై రైతులు ప్రత్యక్షంగా రూ. 16 నష్టపోతున్నారు. గతేడాది నవంబరులో ఇదే చేప కేజీ రూ. 100ల నుంచి 132ల వరకు కొనుగోలు చేసిన వ్యాపారులు ఈ ఏడాది సెప్టెంబరు నుంచి ధరలు తగ్గించుకుంటూ వచ్చి తాజాగా రూ. 84ల వద్ద కొనుగోలు చేస్తున్నారు.

● వ్యాపారుల సిండికేట్

నెల్లూరులో చేపలను కొనుగోలు చేసే వ్యాపారులు కొద్దిమందే ఉన్నారు. వారంతా సిండికేటుగా మారి చేపలపై వారే ధరలు నిర్ణయిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వ జోక్యం పూర్తిగా పక్కకు తప్పుకోవడంతో తమకు ఈ దుస్థితి ఏర్పడిందని సాగురైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ వరకు కేజీ రూప్‌చంద్ చేప రూ. 84లుకు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు తమిళనాడు, కర్నాటక, కేరళ రాష్ట్రాల్లోని మార్కెట్లలో రూ. 150 - 170లకు విక్రయస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఈ జాతి చేపకు దేశీయంగా అంతర్గత మార్కెట్లలో మంచి డిమాండ్ ఉందని, కానీ వ్యాపారుల సిండికేట్‌తో తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని సాగుదారులు చెప్పుకొస్తున్నారు. ధరల కోసం గుంటల్లోనే చేపలను ఉంచుకునేందుకు మరింత పెట్టుబడులు అవుతాయన్న బెంగతో తెగనమ్ముకోవాల్సి వస్తుందని రైతులు చెప్తున్నారు.

● ధరలున్నా.. రోగాలు దండి !

రెండవ ప్రాధాన్యతగా సాగులో ఉన్న గండి, బొచ్చే రకాలకు ధరేమో కేజీ రూ. 120ల వరకు ఉంది. కానీ ఈ జాతి చేపలకు రోగాలు దండిగా వస్తాయని, వాటిని ఎదుర్కొనేందుకు భారీగా పెట్టుబడులు పెట్టాలని రైతులు పేర్కొంటున్నారు. దీంతో ఈ జాతి చేపలను రెండవ ప్రాధాన్యత క్రమంలోనే అతితక్కువగా సాగు చేస్తున్నట్లు చెప్తున్నారు.



గుంతల్లో చేపలు పడుతున్న కూలీలు

నష్టాలతో సాగు

చేపల సాగు చేయాలంటేనే ఆందోళనగా ఉంది. నష్టాలతో పెట్టుబడులు కష్టంగా మారాయి. చేపలు ధరలను ఘననీయంగా తగ్గించుకుంటూ వెళ్తున్నారు. దీంతో పెట్టుబడుల వ్యయం పెరుగుతూనే ఉంది. అప్పులు చేయడం తప్ప మరోమార్గం లేదు. రైతుల కష్టాలను వ్యాపారులు అర్థం చేసుకోవాలి.



- పొణక శివకుమార్‌రెడ్డి, చేపల సాగు రైతు

ధర పెరిగితే తప్ప... మనుగడ కష్టం !

వ్యాపారులు చేపల కొనుగోలు ధరలను పెంచితే తప్ప సాగుదారులకు మనుగడ కష్టం. రూ. లక్షలు ఖర్చు పెట్టి చేపల సాగు చేస్తున్నాం. కరెంట్ మేత, మందులు ఖర్చులు పెరుగుతూ ఉన్నాయి. ఈ సమయంలో కొనుగోలు ధరలు తగ్గిస్తే మత్స్య రంగం మనుగడను కోల్పోతుంది.



- వెడిచర్ల రాజారెడ్డి, చేపలసాగు రైతు


ఈసారి గోదాముల్లోనే..

(5వ పేజీ తరువాయి)

పౌరసరఫరాల అధికారి, అసిస్టెంట్ పౌరసరఫరాల అధికారిపైనా వేటు పడింది. ఆ సంస్థ అధికారులకు మందలింపులు కూడా వచ్చాయి. అయినా ఆ శాఖలోని అధికారుల తీరులో మార్పు రాలేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికీ నెల్లూరు, కావలి కేంద్రంగా ప్రతీ నెలా వేల టన్నుల బియ్యం రీసైక్లింగ్ జరిగి మార్కెట్లోకి వస్తోంది. అయితే అధికారులపై వేటు పడింది కానీ ఇందుకు సూత్రధారులైన రేషన్ మాఫియాపై మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

● అక్కడ ఎవరికి వారే!

జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో పాలన పూర్తిగా గాడి తప్పిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అక్కడ నడిపించే వారు లేకపోవడంతో ఎవరికి వారుగా వ్యవహరిస్తున్నారని, ఇది ఉద్యోగుల మధ్య వివాదాలకు దారితీస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. ఇటీవల వరకూ రెగ్యులర్ డీఎస్‌వోగా పనిచేసిన విజయ్‌కుమార్‌ను ప్రభుత్వం రేషన్ బియ్యం పక్కదారి పట్టిన వ్యవహారంలో బదిలీ చేసింది. అలానే ఆ కార్యాలయంలో పని చేస్తున్న ఏఎస్‌వోను కూడా వేరే జిల్లాకు పంపింది. ఆ తర్వాత రెగ్యులర్ అధికారిని నియమించలేదు. కొన్ని రోజుల తర్వాత మెప్మా పీడీకి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఆమె ఇక్కడ పూర్తిగా దృష్టి పెట్టలేకపోతుండడంతో ఆ కార్యాలయంలో పనిచేసే ఓ ఉద్యోగి కర్రపెత్తనం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల రేషన్ షాపులు, పెట్రోల్ బంకుల తనిఖీలను పూర్తిగా విస్మరించారని, రికార్డుల్లో మాత్రం నమోదు చేసుకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక సివిల్ సప్లయిస్ డీఎం కార్యాలయంలో కూడా పాలన అస్తవ్యస్తంగా ఉందన్న ప్రచారం జరుగుతోంది.



ఊరేగింపుగా ఆలయానికి వెళ్తున్న మహిళలు

ముగిసిన అంకాళమ్మ తిరుణాళ్ల

అనంతసాగరం నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక సోమశిల రోడ్డులోని గ్రామదేవత అంకాళమ్మ ఆలయంలో వారికోత్సవ తిరునాళ్ల సోమవారం ముగిశాయి. పెద్దఎత్తున మహిళలు ఆలయానికి చేరుకొని పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు మాకిరెడ్డి జనార్దన్‌రెడ్డి, వెంకటరెడ్డి సోదరులు అన్నదానం చేశారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు.





హరనాథపురం వద్ద సిగ్నల్ లైట్ల స్విచ్ వేస్తున్న ట్రాఫిక్ పోలీసు, పక్కన గందరగోళంగా ట్రాఫిక్



మొదటి రోజే గందరగోళం !

నగరంలోని ప్రధాన కూడళ్లలో ఆదివారం ట్రాఫిక్ సిగ్నెల్ వ్యవస్థను రాజకీయ నాయకులు ప్రారంభించారు. ప్రారంభించిన తొలిరోజే వాహనదారులు నిబంధనలు పాటించలేదు. దీంతో గందరగోళం నెలకొంది. కొన్ని చోట్ల ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు తాత్కాలికంగా ట్రాఫిక్‌ను చేతులతో నియంత్రించారు. నిపుణులు చెబుతున్నట్లుగా కొత్తగా ఏర్పాటు చేసిన సిగ్నెల్స్ సక్రమంగా పనిచేయాలంటే ప్రజల్లో అవగాహన పెంచడం కీలకం. త్వరలోనే ట్రాఫిక్ పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి,వాహనవారులకు స్పష్టతనివ్వాలి.



\- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, (ఆంధ్రజ్యోతి, నెల్లూరు)

వసతికి శుద్ధి జలం

- ఒక్కొక్క ఆర్వో ప్లాంటు రూ.2 లక్షలు
- జిల్లాకు చేరిన ప్లాంట్లు, కొన్ని చోట్ల ఏర్పాటు
- హాస్టళ్లలో తీరనున్న తాగునీటి కష్టాలు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : హాస్టళ్లలో ఉండే విద్యార్థుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే హాస్టళ్లలో మరమ్మతుల కోసం నిధులు విడుదల చేసిన ప్రభుత్వం, తాజాగా నాణ్యమైన తాగునీటిని అందించేందుకు ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే, ఏదైనా సాధించగలరు. ఈ ఉద్దేశ్యంతో ప్రతి హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్యనుబట్టి ఒకటి లేదా రెండు ఆర్వోప్లాంట్లను మంజూరు చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేయటమే కాక, 45 రోజుల వ్యవధిలో వాటిని ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టింది.

● ఇప్పటికే కొన్ని చోట్ల ఏర్పాటు

ఒక్కొక్కటి రూ.2 లక్షల విలువైన ఆర్వో ప్లాంట్లను హాస్టళ్లకు మంజూరు చేసింది. తొలివిడతగా కొన్ని హాస్టళ్లకు చేరవేసింది. సాంఘిక సంక్షేమ హాస్టళ్లతో పాటు ఏపీఎస్‌డబ్ల్యుఆర్‌ఈఐఎస్ సంస్థలు, ఏపీ స్టడీ స్టడీ సర్కిళ్లకు కూడా ఆర్వో ప్లాంట్లను మంజూరు చేసింది. హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య పెరుగుతుండటంతో తాగునీటి అవసరం అధికమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చాలా హాస్టళ్లలో ఇప్పటి వరకు పాత పద్ధతిలో నీటి సరపరా ఉండటం, కొన్ని చోట్ల ఫిల్టర్‌లు పనిచేయకుండా పోవటంతో ఇబ్బందులు తలెత్తాయి. కొత్తగా ప్రతి సంక్షేమ హాస్టల్‌కు అవసరాన్ని బట్టి ఎక్కు నీటి సామర్థ్యం కలిగిన ఆధునిక సాంకేతికత కలిగిన ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నారు. ప్లాంట్ల నిర్వహణ కోసం ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయిస్తున్నట్లు తెలిసింది.



నగరంలోని బట్వాడిపాలెం కళాశాల బీసీ హాస్టల్‌లో ఏర్పాటు చేసిన శుద్ధి జల ప్లాంటు వద్ద నీరు పట్టుకుంటున్న విద్యార్థినులు

● 12 రాక... అన్నీ హాస్టళ్లలో ఏర్పాటు

జిల్లాలో 69 సాంఘిక సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయి. వీటన్నింటికీ ఆర్వో ప్లాంట్లు మంజూరయ్యాయి. వీటిలో తొలి విడతగా నెల్లూరు, ఆత్మకూరు, కోవూరు, పొదలకూరులోని హాస్టళ్లకు 12 ఆర్వో ప్లాంట్లు వచ్చాయి. మిగిలిన హాస్టళ్లకు త్వరలో రానున్నాయి. వాటిని బిగించి శుద్ధ జలం అందించనున్నారు. ఈ హాస్టళ్లే కాకుండా బీసీ సంక్షేమ, గిరిజన సంక్షేమ హాస్టళ్లు కూడా ఉన్నాయి. వీటికి కూడా ఆర్వో ప్లాంట్లు వచ్చే అవకాశం ఉంది.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జేసీ వెంకటేశ్వర్లు

అర్జీలపై పారదర్శక విచారణ జరపండి

● పీజీఆర్‌ఎస్‌లో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పీజీఆర్‌ఎస్‌కు వచ్చే అర్జీలపై పారదర్శక విచారణ జరపాలని జేసీ మొగిలి వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో పీజీఆర్‌ఎస్ జరిగింది. ఈ సందర్భంగా ప్రజల నుంచి జేసీ అర్జీలు స్వీకరించారు. సంబంధిత అధికారులను పిలిపించి సమస్యలను క్షుణ్ణంగా చదివి పరిష్కరించాలని ఆదేశించారు. సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి వచ్చే అర్జీదారుల సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని అన్నారు. అర్జీదారుల సంతృప్తి చెందేలా సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కోరారు. భూసమస్యలు, ఇతర రెవెన్యూ సమస్యలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని, వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పరిష్కరించలేని సమస్యలను ఎందుకు పరిష్కరించలేక పోతున్నామో వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విజయకుమార్, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

● పొలాన్ని ఆక్రమించి దౌర్జన్యం చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని అల్లూరు మండలం సింగపేట చెలికి గ్రామస్తుడు చెరుకూరు శ్రీనివాసులు జేసీకి వినతిపత్రం సమర్పించారు.

● దొంగ పట్టాలు అడ్డుకోండి

దొంగపట్టాలు అడ్డుకోవాలని చేజర్ల మండలం పెరుమాళ్లపాడు గ్రామస్థులు సోమవారం కలెక్టర్ పీజీఆర్‌ఎస్‌లో వినతిపత్రం అందచేశారు. గ్రామానికి చెందిన తలపనేని జయంతులు డీ ఫారం నమూనా పట్టా పేరుతో దొంగపట్టాలు, దొంగ రికార్డులు సృష్టించి, ఇంటింటికి సరఫరా చేస్తున్నాడని వారు ఆరోపిస్తూ జేసీ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం సమర్పించారు. గ్రామానికి చెందిన కిలారి జయరామయ్య, వేమన మహేష్, కోనంకి వెంకటేశ్వర్లు, బొర్ర వెంకటేశ్వర్లు, చంద్ర శ్రీనివాసులు, షేక్ పరీద్ బాషా, షేక్ నన్నేబాష తదితరులు మాట్లాడుతూ దొంగ పట్టాలు సృష్టించిన జయంతులుపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన జేసీ చేజర్ల ఎమ్మార్వోను విచారణ చేయాలని ఆదేశించారు.



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న పెరుమాళ్లపాడు గ్రామస్థులు

చట్టప్రకారం విచారణ జరిపి న్యాయం చేస్తాం : ఎస్పీ

నెల్లూరు(క్రైం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలీసు పీజీఆర్‌ఎస్‌లో స్వీకరించిన ఫిర్యాదులపై చట్టప్రకారం విచారణ జరిపి, న్యాయం చేస్తామని ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పీజీఆర్‌ఎస్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 113 మంది తరలివచ్చి, వారి సమస్యలు తెలుపుకున్నారు. ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించి, వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులతో ఫిర్యాదుదారులను మాట్లాడించారు. వారికి తక్షణమే ఉపశమనం కలిగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పీజీఆర్‌ఎస్ ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, రూరల్ డీఎస్పీ జీ శ్రీనివాసరావు, ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి, పీసీఆర్ సీఐ భక్తవత్సల రెడ్డి, ఎస్‌బీ సీఐ-2 శ్రీనివాసరెడ్డి, వెల్ఫేర్ ఆర్‌ఐ రాజారావు, తదితరులు పాల్గొన్నారు.



వృద్ధుల వద్దకు వెళ్లి వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఎస్పీ అజిత

రుచిగా మధ్యాహ్న భోజనం

● వంట ఖర్చులు పెంచిన ప్రభుత్వం ● విద్యార్థులకిక నాణ్యమైన తిండి

ఉదయగిరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి సన్న బియ్యం అందజేస్తోంది. దీనికితోడు ఇటీవల నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవడంతో వంట ఏజెన్సీల నిర్వాహకులు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం, పీఎం పోషణ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించేందుకు వంట ఖర్చులను పెంచింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ మధ్యాహ్న భోజనం డైరెక్టర్ శ్రీనివాసరావు ఇటీవల ఉత్తర్వులను జారీ చేశారు.



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న నిర్వాహకురాలు

● నాణ్యమైన భోజనం

సవరించిన చార్జీలు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఫిబ్రవరి 19, 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఆగస్టు 8 నుంచి అమల్లోకి రానున్నట్లు పేర్కొంది. ప్రస్తుత ఇస్తున్న అదనపు మెనూ చార్జీ రూ.0.40 మినహాయిస్తున్నట్లు వివరించింది. మధ్యాహ్న భోజనం చార్జీలు పెరగడంతో పథకం మరింత బలోపేతమవవడంతో పాటు జిల్లాలో 2,507 ప్రభుత్వ పాఠశాలలు, 25 జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న సుమారు 3 లక్షల మంది విద్యార్థిని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం లభిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మధ్యాహ్న భోజన ధరల వివరాలు (రూ.)

తరగతులు	గతం	ప్రస్తుతం
1 నుంచి 5	5.45	6.19
6 నుంచి 8	8.17	9.29
9 నుంచి ఇంటర్	8.17	9.29

గుణ్ణంకట్ట గుటుక్కు!

మిగిలిన ఒక్క వైపూ ఆక్రమణలు



కందుకూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణ నడిబొడ్డున ఉన్న గుణ్ణంకట్ట కుంట కొన్ని దశాబ్దాలుగా మూడువైపుల ఆక్రమణలతో కుచించుకుపోగా ఆక్రమణలు జరగని మిగిలిన ఒక్కవైపు ఆక్రమణలు షురూ అవుతున్నాయి. ఈ కుంటకు తూర్పు వైపున మార్కెట్ సెంటర్ నుంచి శివాలయంకు వెళ్లే రోడ్డు వైపు ఇంతకాలం ఆక్రమణలు జరగలేదు. అయితే అధ్వానంగా ఉన్న ఈ రోడ్డును అభివృద్ధి చేసి సిమెంటు రోడ్డు వేసింది మొదలు తూర్పువైపున ఉన్న భవనాల వారు మెల్లిమెల్లిగా ఆక్రమణలకు తెరతీశారు. ఈ రోడ్డు అభివృద్ధి చెందాక కట్టకింద పెద్దబజారులోకి ఉన్న పలు భవనాల వారు ఇటువైపు కూడా ద్వారాలు ఏర్పాటు చేయటంతో పాటు కొందరు రోడ్డులోకి అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు. ఈ దశలో సోమవారం ఓ భవన యజమాని ఏకంగా రోడ్డుకి అడ్డంగా రోడ్డులోనే బోరు వేశారు. ఇది ఆక్రమణదారుల బరి తెగింపునకు అద్దం పడుతోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే మిగిలిన ఒక్కవైపు కూడా ఆక్రమణలతో గుణ్ణంకట్ట ఆనవాళ్లు కోల్పోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు కఠిన చర్యలు చేపట్టి సర్వే చేయించి తూర్పువైపు కట్టపై, మిగిలిన ప్రాంతాల్లో గుణ్ణంకట్ట ఆక్రమణలను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స

నెల్లూరు (వైద్యం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జీజీహెచ్ ఈఎన్‌టీ విభాగంలో అరుదైన శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. సోమవారం ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి మాట్లాడారు. నెల్లూరుకు చెందిన వేళాంగిణి(38)కి ముక్కు నుంచి రక్తం కారటం, ఎడమకన్ను వాపు, ముఖంలో ఎడమవైపు నొప్పి రావడంతో జీజీహెచ్‌లోని ఈఎన్‌టీ విభాగానికి వచ్చిందన్నారు. వైద్యులు పూర్తిస్థాయి పరీక్షలు చేసి, సిటీస్కాన్ తీశారని తెలిపారు. ఎడమ ముక్కులో కండ పెరిగటం కారణంగా చూపునకు కూడా అంతరాయం ఏర్పడిందన్నారు. దీంతో ఎండోస్కోపి ద్వారా ఆధునిక పరికరాలతో శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించామని ఆమె తెలిపారు. దీంతో ఆ బాధితురాలు పూర్తిగా కోలుకున్నదన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుకుమార్, డిప్యూటీ కలెక్టర్ పరమేశ్వర్‌రెడ్డి, ఏడీ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



శస్త్రచికిత్స చేయించుకున్న రోగితో వైద్యులు, అధికారులు

మా ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు!

- అధికారుల తీరుపై చేనేతల ఆగ్రహం
- కలెక్టరేట్ ఎదుట రాట్నాలతో ఆందోళన

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ సాయం ఇవ్వకపోగా బియ్యం కోసం మగ్గం గుంతలు నిర్మించారంటూ అధికారులు పేర్కొనడాన్ని నిరసిస్తూ చేనేత కార్మికులు కలెక్టరేట్ ఎదుట రాట్నంతో వినూత్న రీతిలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా చేనేత ఐక్య వేదిక కన్వీనర్ బుధవారపు బాలాజీ మాట్లాడుతూ వరుస వర్షాలకు, తుఫానులకు నూలు డిజైన్ అట్టలు మెత్తబడి గుంతల్లోకి నీరు చేరి రోజువారి ఉపాధిని చేనేతలు కోల్పోయారని తెలిపారు. వారికి తుఫాన్ సాయం అందించటంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. నారాయణరెడ్డిపేట, పొదలకూరు, తాటిపర్తి, మడమనూరు, గుమ్మలదిబ్బ తదితర ప్రాంతాలలో చేనేతల వివరాలు సేకరించటంలో అధికారులు విఫలమయ్యారని మండిపడ్డారు. కరెంటు మీటరు నేతన్న పేరుమీద లేదని, వర్షాల సమయంలో వేరే పనికి పోయారని, తాము చూసినప్పుడు మగ్గం మీద పనిలో లేరనే కారణాలను అధికారులు చూపడాన్ని తప్పుపడుతున్నామన్నారు. చేనేతలను అవమానించి ఆత్మగౌరవాన్ని అధికారులు దెబ్బతీశారని వాపోయారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు బాధితులను ఆదుకోమని ఆదేశాలు ఇచ్చినా అధికారులు బియ్యం కోసం నేతన్నలు ఆరాట పడుతున్నారంటూ ఎద్దేవా చేశారన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందచేశారు. ఈ ధర్నాలో బీజేపీ నేతలు మిడతల రమేష్, కందికట్ల రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ల దొంగ అరెస్ట్

● 8 ద్విచక్రవాహనాల స్వాధీనం



నెల్లూరు(క్రైం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వరుసగా బైక్‌ల చోరీకి పాల్పడుతూ పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న నిందితుడిని బాలాజీ నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి ఎనిమిది మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి వివరాలను సోమవారం బాలాజీనగర్ పోలీసు స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ కే సాంబశివరావు తెలిపారు. కోవూరు మండలం ఇనుమడుగు మిక్స్‌డ్‌కాలనీకి చెందిన గూడూరు చిరంజీవి బైక్ మెకానిక్‌గా జీవనం సాగిస్తున్నాడు. వ్యసనాలకు బానిసైన చిరంజీవి సరిపడా నగదు కోసం బైక్ దొంగగా మారాడు. ఈనెల 8న పూలేబొమ్మ వద్ద మైపాడుకు చెందిన రవి బైక్ చోరీ జరిగింది. రవి ఫిర్యాదు మేరకు బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ కే. సాంబశివరావు పర్యవేక్షణలో ఎస్‌ఐ విజయ్‌శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి సాంకేతికత ఆధారంగా నిందితుడు చిరంజీవిగా గుర్తించారు. సోమవారం ఇనుమడుగు వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. నెల్లూరు బాలాజీనగర్ పోలీసుస్టేషన్ పరిధిలో నాలుగు బైక్‌లు, నవాబుపేట పోలీసు స్టేషన్‌లో 2, చిన్నబజారు, కోవూరు స్టేషన్ల పరిధిలో ఒక్కో బైక్‌ను దొంగలించినట్లు నిందితుడు అంగీకరించాడు. చిరంజీవిని అరెస్ట్ చేసి, అతడి వద్ద నుంచి ఎనిమిది బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. బైక్ దొంగను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఇన్‌స్పెక్టర్, ఎస్‌ఐ, సిబ్బంది కేవీ సుధాకర్, రమేష్, వెంకటరావు, జయరామయ్య, శివకుమార్, శ్రీహరి, తిరుపతి, సాయి కిషోర్‌లను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

ఆయిల్ పామ్‌కు రాయితీలు

● సాగుకు ఆసక్తి చూపుతున్న రైతులు ● జిల్లాలో పెరిగిన తోటల విస్తీర్ణం

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో పెట్టుబడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఏళ్ల తరబడి రైతులు పంట మార్పిడిపై దృష్టి పెట్టడం లేదు. అధికశాతం మంది వరి సాగుకే మొగ్గు చూపుతున్నారు. ఒక్కోసారి ఆశించిన దిగుబడులు రావడం లేదు. దీనికి తోడు ఖర్చులు బాగా పెరిగాయి. దీంతో గిట్టుబాటు కాని పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితిలో ప్రభుత్వ ప్రోత్సాహంతోపాటు రాయితీలు అందడంతో రైతులు ఆయిల్ పామ్ సాగుకు ఆసక్తి చూపుతున్నారు.



ఆయిల్‌పామ్ మొక్క నాటుతున్న రైతులు, అధికారులు(ఫైల్)

● పెరిగిన సాగు విస్తీర్ణం

సాంప్రదాయ పంటల సాగులో ఆశించిన ఫలితాలు రాకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటలపై ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకొస్తున్నారు. గత ఐదేళ్లలో పరిశీలిస్తే జిల్లాలో ఆయిల్ పామ్ సాగు ఊపందుకుంది. 2021-22లో 723 ఎకరాల్లో మాత్రమే ఆయిల్ పామ్ సాగు అయింది. 2022-23లో 850 ఎకరాలు, 2023-24లో 1050, 2024-25లో 2571, 2025-26లో ఇప్పటి వరకు 3355ఎకరాల్లో సాగవుతున్నట్లు ఉద్యానశాఖ లెక్కలు చెబుతున్నాయి.

● ప్రభుత్వ రాయితీలు

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యానశాఖద్వారా ఎకరాకి 50 మొక్కల చొప్పున నూరుశాతం రాయితీపై అందిస్తుంది. మొత్తం నాలుగేళ్లకుగాను ఇండిజినస్ ఆయిల్ పామ్ సాగుకు రూ.62వేలు. ఇంపోర్టెడ్ ఆయిల్ పామ్ సాగుకు రూ.71వేలు ఉద్యానశాఖ ద్వారా రైతులకు రాయితీ అందుతోంది. యాంత్రీకరణ, నీటివసతి తదితరాలకుం రూ.22వేల నుంచి రూ.1.50లక్షల వరకు రాయితీ ఇస్తున్నారు. నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్ పథకం కింద జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు ఆయిల్ పామ్ కంపెనీ వారు అమ్మా పామ్ ప్లాంటేషన్ ప్రైవేటు లిమిటెడ్‌లను జిల్లాకు కేటాయించారు. వీటి ద్వారా ఆయిల్ పామ్ మొక్కలను ఉచితంగా సరఫరా చేస్తున్నారు.

● దిగుబడులు ఇలా....

ఆయిల్ పామ్ ఎకరాకు 50 మొక్కల చొప్పున చతురస్రాకార పద్ధతిలో నాటుకోవలి. భూసారం, యాజమాన్య పద్ధతులు మొక్క ఎదుగుదలను బట్టి 4సంవత్సరాల నుంచి దిగుబడులు వస్తాయి. మొదటి కాపు ఎకరానికి 3 నుంచి 4టన్నులు వస్తున్నాయి. 8సంవత్సరాల వయసు కలిగిన తోటలకు ఎకరాకి 8 నుంచి 10 టన్నుల దిగుబడి వస్తున్నట్లు ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. మొదటి నాలుగు సంవత్సరాలు అంతర పంటలుగా పత్తి, వేరుశగన, కూరగాయలు, పూల మొక్కలు, జామ, కోకో తదితర పంటలు సాగుకు కూడా ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తోంది. అంతేకాకుండా దళారీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వం ప్రకటించిన ధరల ప్రకారమే కంపెనీలు పంటను కొనుగోలు చేస్తాయి. నేరుగా రైతుల ఖాతాల్లోకి నగదు జమ అవుతుంది.

సద్వినియోగం చేసుకోవాలి



ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఆయిల్ పామ్ తోటల సాగు, యాజమాన్య పద్ధతులు, మార్కెటింగ్, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలు తదితర విషయాలపై గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఆసక్తి కలిగిన రైతులు రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బందిని, ఉద్యాన అధికారిని సంప్రదించాలి.

\- ఎంవీ సుబ్బారెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి

2న ఎర్ర చెరువు లీజు వేలం

సంగం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎర్ర చెరువులో 1435 ఫసలికి సంబంధించి చేపలు పెంచుకొని పట్టుకొనుటకు లీజు వేలం పాట డిసెంబరు 2వ తేదీన నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి నరసయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనదలచినవారు ఆరోజు మధ్యాహ్నం 3 గంటలకు పంచాయతీ కార్యాలయంలో నిర్వహించే వేలంపాటలో ముందుగా ధరావత్తు రూ. 20 వేలు చెల్లించాలని ఆయన తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11788
వెండి కిలో ధర	రూ. 158200
వెండి ఒక గ్రాము	రూ. 163.20

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే కాకర్ల

వింజమూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని, అన్నదాత సుఖీభవ పథకంతో రైతన్నల్లో హర్షం వ్యక్తమవుతోందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. సోమవారం వింజమూరు మండల పరిధిలోని చంద్రపడియ గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రవీణ దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా మాతమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అలాగే గ్రామంలో నెలకొన్న చిన్నచిన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు చల్లా వెంకటేశ్వర్లుయాదవ్, మండల ఉపాధ్యక్షుడు ఆనంగి రమణయ్యయాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జ్ చేబ్రోలు వసంతరావు, క్లస్టర్ కో ఇన్‌చార్జ్ పాములపటి మాల్యాద్రి, ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి, శేషగిరిరావు, ఏవో వాసు, హెచ్ఓ షాకీర్, ఆర్ఐ ఇమ్రాన్‌ఖాన్, వీఆర్వో వీరవల్లి పంచాయతీ కార్యదర్శులు రామారావు, జయలక్ష్మీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వింజమూరు : రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దంపతులు

● **ఆత్మకూరు:** అభివృద్ధిలో రైతులను భాగస్వాములను చేయడమే ప్రభుత్వ లక్ష్యం అని టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి తెలిపారు. సోమవారం మున్సిపాల్టీ పరిధిలోని పలు ప్రాంతాల్లో రైతన్నా మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతాంగానికి పెద్దపీట వేస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, పట్టణ మహిళా అధ్యక్షురాలు కొప్పోలు రమాదేవి, పట్టణ కార్యదర్శి తోడేటి వెంకటయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు సూరా భాస్కర్‌రెడ్డి, షేక్ మహబూబ్‌బాషా, పొడమేకల పెంచలయ్య, శివకోటారెడ్డి, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

● **దుత్తలూరు (ఉదయగిరి):** రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందని మండల టీడీపీ కన్వీనర్ ఉండేలా గురవారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని నందిపాడు, భైరవరం, దుత్తలూరు-1 రైతుసేవా కేంద్రాల పరిధిలో రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికెళ్లి రైతులకు కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చెంచమ్మ, మండల వ్యవసాయాధికారి మదన్ మోహన్, టీడీపీ నాయకులు దయానందం, కాకర్ల మధు, వెంగళరెడ్డి, వెంకటరెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

● **సంగం:** మండలంలోని సంగం, తరుణవాయి రైతు సేవా కేంద్రాల్లో సోమవారం రైతన్నా మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మండల వ్యవసాయాధికారి శశిధర్ ఆధ్వర్యంలో పంచ సూత్రాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంగం పీఏసీఎస్ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బాణా శ్రీనివాసులురెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు కర్నాటి రవీంద్రరెడ్డి, ఏఈవో, విఏఏలు, రైతులు పాల్గొన్నారు.

● **వరికుంటపాడు (ఉదయగిరి రూరల్):** రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలన సాగిస్తున్నారని టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు అన్నారు. సోమవారం వరికుంటపాడు, రామాపురం గ్రామాల్లో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేసి పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, సొసైటీ అధ్యక్షుడు గుర్రం గోపి, క్లస్టర్ ఇన్‌చార్జి పోకా మహేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ యాదవ్, నక్కలగండి ఛైర్మన్ వేమూరి మధు, ముజ్జి లక్ష్మీనారాయణ, జనసేన అధ్యక్షులు పఠాన్ రసూల్, కొత్తులూరి మహదేవ, గడిపూటి మురళీకృష్ణ, ఆవుల అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

● **సీతారామపురం:** మండల కేంద్రంలోని బసినేనిపల్లి గ్రామ పంచాయతీలో సోమవారం రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి మండల వ్యవసాయాధికారి పి చెన్నరెడ్డి ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతుల ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు.

ముగిసిన అంకాళమ్మ తిరుణాళ్ల



ఊరేగింపుగా ఆలయానికి వెళ్తున్న మహిళలు

అనంతసాగరం నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సోమశిల రోడ్డులోని గ్రామదేవత అంకాళమ్మ ఆలయంలో వారికోత్సవ తిరునాళ్ల సోమవారం ముగిశాయి. పెద్దఎత్తున మహిళలు ఆలయానికి చేరుకొని పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు మాకిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, వెంకటరెడ్డి సోదరులు అన్నదానం నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బర్రెడ్డి కృష్ణారెడ్డి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సత్య సాయిబాబా జయంతి వేడుకలు



సత్య సాయిబాబా చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న అధికారులు

సంగం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో షాలెట్ ఆధ్వర్యంలో భగవాన్ సత్య సాయిబాబా శతజయంతి ఉత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్య సాయిబాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ డీఈఈకి సన్మానం



డీఈఈని సన్మానిస్తున్న జేవీవీ నాయకులు

ఉదయగిరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ శాఖా కార్యాలయంలో ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఈఈ కె సుధీర్‌చౌదరిని జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం సన్మానించి అభినందనలు తెలిపారు. ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలో రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఆయనను కోరారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు దస్తగిరిఅహ్మద్, గాజులపల్లి రామిరెడ్డి, షేక్ జాఫర్‌అహ్మద్, షేక్ షంషీర్, ఎంఏ సలీం, గడ్డం రాజా తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల హాజరుపై విచారణ

కలువాయి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ బాలుర, బాలిక హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థుల హాజరుపై సోమవారం పొదలకూరు సహాయ సాంఘీక సంక్షేమాధికారి (ఏఎస్‌డబ్ల్యు) సుధామణి స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లి ప్రధానోపాధ్యాయులను విచారించారు. ఈ సందర్భంగా ఏఎస్‌డబ్ల్యు మాట్లాడుతూ పాఠశాలకు వచ్చి హాస్టల్ విద్యార్థుల హాజరును ఎవరూ తీసుకోవడం లేదని హెచ్ఎం తెలిపారని ఆమె చెప్పారు. హాస్టల్ విద్యార్థులకు ప్రస్తుతం ముఖహాజరు వేస్తున్నారని అది పాఠశాలకు వచ్చి తీసుకునే వీలుండదని ఆమె వివరించారు.

సమస్యల పరిష్కారం కోసం వీఆర్ఏల ఆందోళన



ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీఐటీయూ, వీఆర్ఏల సంఘం నాయకులు

ఆత్మకూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ సహాయకుల (విఆర్ఏ)ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విఆర్ఏల సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నుపాటి లచ్చయ్య మాట్లాడుతూ వీఆర్ఏలకు పేస్కేలు అమలు చేయాలని, అర్హులైన వీఆర్ఏలకు వీఆర్వోగా పదోన్నతి కల్పించాలని, నామినీ లుగా పని చేస్తున్న వారిని వీఆర్ఏలుగా నియమించాలని కోరారు. రెవెన్యూశాఖలో ఖాళీగా ఉన్న వీఆర్వో, రికార్డ్ అసిస్టెంట్, అటెండర్, నైట్ వాచ్‌మేన్ పోస్టులను పూర్తిగా వీఆర్ఏలతో భర్తీచేయాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈమేరకు వారు ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు జి శివప్రసాద్, ఆత్మకూరు నాగయ్య, కొండమూరి హజరత్తయ్య, వీఆర్ఏల సంఘం జిల్లా కార్యదర్శులు జి ఓబులేశు, దుర్గయ్య, మండల అధ్యక్షుడు సుదర్శన్ పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ఫీజు చెల్లింపు




విద్యార్థుల పరీక్ష ఫీజు నగదు హెచ్ఎంలకు అందజేస్తున్న మండల టీడీపీ నాయకులు

సీతారామపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2025-26 విద్యాసంవత్సరంలో పదో తరగతి పరీక్ష రాస్తున్న 241 మంది విద్యార్థులకు పరీక్ష ఫీజును టీడీపీ మండల కన్వీనర్ చింతల శ్రీనివాసులు చెల్లించారు. విద్యార్థుల పరీక్ష ఫీజు నగదును టీడీపీ నాయకులు ఎంఈవో కార్యాలయంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సోమవారం అందజేశారు. ఈకార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సుమన్‌బాబు, మండల యూత్ అధ్యక్షుడు వీకాష్‌బాబు, సీనియర్ నాయకులు వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, సొసైటీ ఛైర్మన్ రాజశేఖర్, జనసేన పార్టీ నాయకులు భోగినేని కాశీరత్తయ్య పాల్గొన్నారు.

●**మర్రిపాడు :** పదవ తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజు మొత్తాన్ని టీడీపీ నాయకులు బిజివేముల సురేంద్రనాథ్‌రెడ్డి చెల్లించనున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. మర్రిపాడు మండలంలో 12 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా అందులో ఈ ఏడాది మొత్తం 350మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయనున్నారని, రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలతో ప్రతీ ఒక్కరి ఫీజు మొత్తాన్ని తన సొంత నిధులను బుధవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో ఆయా ప్రధాన్యోపాధ్యాయులకు అందించనున్నట్లు సురేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎంఈవో

ఉదయగిరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలని ఎంఈవో-1 టీ వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం మండలంలోని ఆర్లపడియ మెయిన్ ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా తరగతుల వారీగా విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం సంబంధిత రిజిస్టర్లు పరిశీలించి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీచేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అమరావతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ మొదలైంది

● పక్కదారి పడుతున్న పేదల బియ్యం
● పట్టించుకోని అధికార యంత్రాంగం



వెంగంపల్లి వద్ద పట్టుకున్న రేషన్ బియ్యం సీల్ బస్తాలు (ఫైల్)

అనంతసాగరం నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పేదల బియ్యాన్ని పక్కదారి దోచేస్తున్న వారిపై చర్యలు కరువయ్యాయి. వాహనాలతో సహా వందలాది రేషన్ బియ్యం పట్టుకొన్న సూత్ర, పాత్రదారులు ఎవరనేది తెలీదు. ఇది బహిరంగ రహస్యం కాగా.. మరలా మాఫియా సభ్యులు తమ ప్రతాపం చూపుతున్న పరిస్థితి నెలకొంది. మండలంలో మూడు నెలల పాటు ఆగిన రేషన్ మాఫియా కార్యచరణ మళ్లీ మొదలైంది. పేదల బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న వారిపై చర్యలు కరువయ్యాయి. రేషన్ బియ్యాన్ని బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తున్నా పట్టించుకునే నాథుడే లేడన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాగరం కేంద్రంగా వివిధ మండలాల నుంచి రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు తెలుస్తోంది. వెంగంపల్లికి చెందిన ముగ్గురు మాఫియా సభ్యులు వేర్వేరుగా ఈవ్యాపారం చేస్తున్నట్లు సమాచారం. వారు సేకరించిన బియ్యాన్ని రహస్య ప్రాంతాల్లో నిల్వచేసి మినీ ట్రక్కులు, లారీల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ దందా నడుపుతున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

రేషన్ డీలర్ల పాత్ర కీలకం

కాగా, ఈవ్యవహారంలో కొందరు రేషన్ డీలర్ల పాత్ర కీలకంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం యూనిట్‌కు 5 కిలోల చొప్పున లబ్ధిదారులకు బియ్యం ఇస్తుండగా వారి నుంచి కిలో రూ. 10 నుంచి రూ. 15 తీసుకొని సీల్ బస్తాలు మాఫియాకు కేజీ రూ. 20 నుంచి రూ. 23కు అమ్ముతారు. ప్రయివేటు వ్యక్తులను మాఫియా రంగంలో దింపి అక్రమ వ్యాపారం సాగిస్తున్నారు.



వెంగంపల్లిలో షెడ్డులో అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యం బస్తాలు (ఫైల్)

చర్యలు నామ మాత్రమే?

అనంతసాగరం మండలంలో ఇప్పటికి నాలుసార్లు రేషన్ బియ్యం పట్టుకున్నారు. ఈఏడాది సెప్టెంబరు 3న వెంగంపల్లి వద్ద పొలాల్లో దాచిన సుమారు 300 బస్తాలకు పైగా రేషన్ బియ్యాన్ని స్థానికులు అధికారులకు పట్టించారు. ఇంత మొత్తంలో సీల్ బస్తాలు దొరికినా సూత్రదారులపై ఇంతవరకు చర్యలు లేవు. ఆతర్వాత మరో రెండు సార్లు బియ్యం పట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రేషన్ మాఫియాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ



గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సత్యసాయి వెలుగు బృందం

సంగం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన కాలనీలోని గిరిజనులకు సత్యసాయి వెలుగు బృందం సభ్యులు సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. సత్యసాయిబాబా శత జయంతి వారోత్సవాలను పురస్కరించుకుని నిరుపేద గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి వెలుగు బృందం సభ్యులు శ్రీరామ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శిక్షణ తరగతులు



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందచేసిన సంస్థ ప్రతినిధులు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దిరెడ్డిపల్లి, నార్తకొండాయపాళెం ఉన్నత పాఠశాలల్లో సోమవారం మానవత సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాశంపై శిక్షణా తరగతులు నిర్వహించారు. అనంతరం గతేడాది పదో తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రొత్సాహక నగదుతో పాటు మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు వెండిదండి వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడు బీఎస్ రంగారెడ్డి, విద్యా కార్యదర్శి సేగు కృష్ణయ్య, ప్రధానోపాధ్యాయులు నాయుడు రవి, తదితరులు పాల్గొన్నారు.

వీపీఆర్ సేవలు అభినందనీయం

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మారుమూల ప్రాంతాల్లోను వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న సేవలు అభినందనీయమని టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు అన్నారు. సోమవారం పామూరుపల్లి, నార్తకృష్ణంరాజుపల్లి గ్రామాల్లో వీపీఆర్ నేత్ర ఇన్‌చార్జి శంకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనం ద్వారా శిబిరాలను నిర్వహించారు. ఆయా పంచాయతీల్లో 208 మందికి పరీక్షలు నిర్వహించి 93 మందికి కంటి అద్దాలు అందజేశారు. వైద్యులు విజయ్, ప్రసాద్, సర్పంచు తెల్లగొర్ల సుశీల, గ్రామ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెల్లగొర్ల వెంకటయ్య, మాదినేని వెంగళరావు, బూత్ ఇన్‌చార్జీలు చంద్ర నరసయ్య, నక్కల నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

27న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

ఉదయగిరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 27వ తేదీన ఉదయగిరి తాలుకా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి షేక్ మహ్మద్‌జావీద్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికలతోపాటు అదేరోజు సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉదయగిరి తాలుకా పరిధి లోని సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు, మర్రిపాడు మండలాలకు సంబంధించిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘ సభ్యులు, ఉద్యోగులు పాల్గొని ప్రజాస్వామ్య పద్ధతిలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని కోరారు.ఈ ఎన్నికలకు సహాయ అధికారిగా నెల్లూరు నగర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యదర్శి వీ.ఫణీంద్ర వ్యవహరిస్తారన్నారు.

ఆర్థిక సాయం అందజేత



నగదును అందజేస్తున్న సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి

ఆత్మకూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలో ఇటీవల మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు సోమవారం సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. ఒకటవ వార్డు పరిధిలోని మేకల సుబ్బరామయ్య, కరేటి అంకయ్య, 13వ వార్డు పరిధిలో చిన్నకొండమ్మ, 22వ వార్డులో దావా పరంధామయ్య, 23వ వార్డులో నంబూరు లక్ష్మమ్మ కుటుంబాలను ఆయన పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.10 వేల వంతున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు, చెరుకూరు తిరుపతి నాయుడు, బిజెపి పట్టణ మాజీ అధ్యక్షుడు కట్టా మహేష్‌రెడ్డి, రాంపల్లి ప్రసాద్, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్ల అరెస్ట్

● కొంత నగదు రికవరీ ● మరికొంత ఫ్రీజింగ్
● కేసు ఛేదించిన సిబ్బందికి ఎస్పీ అభినందనలు



ఎస్పీ అజిత నుంచి ప్రశంసలు అందుకున్న పోలీసు సిబ్బంది

నెల్లూరు(క్రైం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అంతర్‌రాష్ట్ర సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేసి నగదు రికవరీతోపాటు ఖాతాలోని నగదును ఫ్రీజింగ్ చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల సోమవారం అభినందించారు. అనంతరం ప్రశంసాపత్రాలు అందజేశారు. కావలిలోని ఓ వ్యక్తికి ఆర్టీవో చలానా పేరుతో ఏపీకే ఫైల్ పంపించి, అతని ఖాతాలోని సుమారు రూ.24 లక్షల నగదును సైబర్ నేరగాళ్లు దోచేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఒకటవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు సాంకేతికత ఆధారంగా నిందితులు జార్ఖండ్ రాష్ట్రం జంతారా జిల్లా కర్మాటూర్ పోస్ట్ తేబుల్‌బండ గ్రామానికి చెందిన వివేక్‌కుమార్ మండల్, హేత్ కర్మాటూరు గ్రామానికి చెందిన రాకేష్‌కుమార్ మండల్, సంజయ్ మండల్‌గా గుర్తించారు. కావలి నుంచి ప్రత్యేక బృందం ఈనెల 14న జార్ఖండ్ జాంతారాలో నిందితులను అదుపులోకి తీసుకుని అక్కడి కోర్టులో హాజరు పరిచారు.అనంతరం ఈనెల 18న కావలి కోర్టులో హాజరుపరచగా, న్యాయాధికారి రిమాండ్ విధించారు. కోర్టు అనుమతితో పోలీసులు ఈనెల 20న నిందితులను పోలీసు కస్టడీకి తీసుకున్నారు. వారిని విచారించి, వారి వద్ద నుంచి రూ.21.90 లక్షల నగదు, సెల్‌ఫోన్, బ్యాంక్ ఖాతాలోని రూ.1,23,855 నగదును ఫ్రీజ్ చేశామని ఎస్పీ తెలిపారు. నాలుగు రోజుల కస్టడీ ముగియడంతో కోర్టులో నిందితులను హాజరుపరిచి, వారిని రిమాండ్‌కు తరలించామన్నారు. కేసును ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనపరిచిన కావలి ఒకటోపట్టణ ఇన్‌స్పెక్టర్ ఎండీ ఫిరోజ్, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఏ. వెంకటేశ్వర్లు, కావలి ఎస్ఐ ఎస్ సుమాన్, సైబర్ క్రైమ్ సిబ్బంది పీ. శ్రీనివాసులరెడ్డి, రవీంద్ర, కావలి సిబ్బంది వీ. మధుసూదన్, శ్రీరామ్, శ్రీహరి, శివకుమార్‌లను ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు నిందితుల బైండోవర్

నెల్లూరురూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇటీవల సింగవరం మహేష్ అనే వ్యక్తిపై దాడికి పాల్పడి, చంపేస్తామంటూ బెదిరించిన ముగ్గురు నిందితులను రూరల్ పోలీసులు రూరల్ తహసీల్దారు కృష్ణప్రసాద్ ఎదుట సోమవారం హాజరుపరిచారు. మహేష్‌ను ఆటోలో తీసుకెళ్లి రాజుపాళెం వద్ద చంపేస్తామంటూ బెదిరించిన వారిలో వికేష్, వంశీ, మోహన్‌లున్నారు. మరోసారి నేరాలకు పాల్పడితే ఒక్కొక్కరికి రూ. 5లక్షల చొప్పున జరిమానా విధిస్తామని తహసీల్దారు వారిని హెచ్చరించినట్లు పోలీసులు తెలిపారు.

ఆటో మిస్సింగ్‌పై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వెంకటరమణ హోటల్ సమీపంలో నిలిపిన ఆటో కనిపించలేదని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిన్నబజారు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. కాగితాలపూరుకి చెందిన జుకఫ్‌ఖార్‌అలి నెల్లూరులో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఈనెల 22న మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఏపీ 39డబ్ల్యూఎఫ్0917 నెంబరు కలిగిన తనఆటోను వెంకటరమణ హోటల్ సమీపంలో పార్క్ చేసి, హోటల్‌లోకి టిఫిన్ చేసేందుకు అలి వెళ్లారు. తిరిగి వచ్చి చూడగా ఆటో కనిపించలేదు. చుట్టుపక్కల గాలించినా ప్రయోజనం లేకపోవడంతో సోమవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పి కారు బోల్తా

● త్రుటిలో తప్పిన ప్రమాదం



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

ఉదయగిరి, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని శకునాలపల్లి గ్రామ స మీపంలో కారు అదుపు తప్పి బోల్తాపడడంతో త్రుటిలో ప్రమాదం త ప్పిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసు కొంది. వివరాల మేరకు.. పుల్లాయపల్లి గ్రామానికి చెందిన కొందరు యువకులు కారులో యర్రబల్లిగడ్డ సెంటర్‌కు వస్తుండగా శకునాల పల్లి గ్రామ సమీపాన రాగానే ఒక్కసారిగా కారు అదుపుతప్పి గుం తలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయా ణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు.

మోటారు బైక్ మాయంపై ఫిర్యాదు

సంగం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి: మండలంలోని తరుణవాయి రోడ్డు సమీపంలో ముంబాయి రహదారి పక్కన నిలిపిన మోటారు బైక్ మాయంపై సోమవారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల మేరకు.. వై వంశీ అనే యువకుడు ఏపీ 39 ఎఫ్ఎం 1315 నెంబరు గల మోటారుబైక్‌ను రోడ్డు పక్కన నిలిపి పొలంలో పనికి వెళ్లాడు. పొలం పనులు ముగించుకుని మధ్యాహ్నం ఇంటికి వచ్చేందుకు బైక్ పెట్టిన చోటకు రాగా అప్పటికే బైక్ లేదు. దీంతో చోరీకి గురైందని భావించి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అనధికార మద్యం దుకాణంపై దాడి

ఉదయగిరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్రపల్లి బీసీ కాలనీలో నిర్వహిస్తున్న అనధికార మద్యం దుకాణంపై సోమవారం ఉదయగిరి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ దీప్తికరంత్ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఏడు మద్యం సీసాలతోపాటు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

మేయర్‌గా స్రవంతి వద్దు!

(5వ పేజీ తరువాయి)

నుంచి ఎలాంటి మద్దతు ఇవ్వకూడదన్న సంకేతాలు నేతల్లో వ్యక్తమయ్యాయి. స్రవంతిపై కార్పొరేటర్లంతా తిరుగుబాటు చేసి ఆమెను పదవి నుంచి తొలగించాలని కోరుతు జేసీకి అవిశ్వాస లేఖను అందచేసిన నేపథ్యంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి, పార్టీ నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డిలు నెల్లూరులోని ఆపార్టీ కార్యాలయంలో సమావేశమయ్యారు. విశ్వసనీయ సమాచారం మేరకు ప్రస్తుతం మే యర్ తమ పార్టీలో లేనందున తాజా పరిణామాలపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం ఉత్తమమని వారంతా నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవల డిప్యూటీ మేయర్ ఎన్నిక సమయంలో మేయర్ స్రవం తి ఓటు హక్కును వినియోగించుకోవడంలో గైర్హాజరవడంపై వైసీపీ నాయకులు సీరియస్‌గా ఉన్నారు. ఈ నేపథ్యంలో అవిశ్వాసంలోనూ పట్టించుకోకూడదన్న వాదనకు వచ్చినట్లు సమాచారం.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	115
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234

కోడిగుడ్ల ధర (100): 660

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంలో జరుగుతున్న రోడ్ల విస్తరణ పనుల్లో భాగంగా లైన్‌వర్క్ ఉన్నందున ఓవీ రోడ్డులోని సీటీఆర్‌ఐ ఫీడర్, పామూరురోడ్డు ఫీడర్లలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయను న్నట్లు టౌన్ ఏఈఈ టీవీ నరసింహం ఓ ప్రకటనలో తెలిపారు. సీటీఆర్‌ఐ ఫీడర్‌లో ఉదయం 9.30 నుంచి, సాయంత్రం 4.30 గంటల వరకు, పామూరు రోడ్డులో ఉదయం నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. ఈ ఫీడర్ల పరిధిలోని ప్రజలు సహకరించాలని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే ఇంటూరిని కలిసిన జడ్పీ సీఈవో

కందుకూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జడ్పీ సీఈవో ఎల్.శ్రీధర్‌రెడ్డి సోమవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. జడ్పీ నుంచి కందుకూరు నియోజకవర్గానికి రావాల్సిన నిధులు, అభివృద్ధికి సంబంధించి ఇతర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈవోను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు.

రాళ్లపాడు ఆయకట్టులో

తగ్గనున్న వరి సాగు!

● వరి పైరుకు పెట్టుబడులు అధికం.. మద్దతు ధర శూన్యం ● 40 శాతం రైతులు పత్తి సాగుపై ఆసక్తి

● ఆశాజనకంగా దిగుబడులు, గిట్టుబాటు ధరే కారణం



నిండుకుండలా రాళ్లపాడు ప్రాజెక్టు

లింగసముద్రం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో ఈ ఏడాది వరి సాగు ఘననీయంగా తగ్గనుంది. దానికి ప్రత్యామ్నాయంగా పత్తి సాగు చేసేందుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. వరి సాగుకు అధిక పెట్టుబడులు పెట్టాల్సి రావడం, మద్దతు ధర అంతంత మాత్రంగానే ఉండడం.. పత్తి సాగులో ఖర్చు తక్కువతో పాటు దిగుబడులు ఆశాజనకంగా ఉండడం, మంచి గిట్టుబాటు ధర లభిస్తుందన్న ఉద్దేశంతో రైతులు వరికి ప్రత్యామ్నాయంగా పత్తిని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. దీంతో దాదాపు 40 శాతం మంది రైతులు పత్తిసాగుపై ఆసక్తి చూపుతున్నారు. మొంథా తుఫాను ప్రభావంతో రాళ్లపాడు ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 20 అడుగులకు నీరు చేరడంతో నిండుకుండను తలపిస్తోంది. దీంతో ప్రాజెక్టు కుడి ఎడమ కాలువల ఆయకట్టు పరిధిలో రైతులు వ్యవసాయ పనుల్లో పూర్తిగా నిమగ్నమయ్యారు.అయితే ప్రాజెక్టులో అధికారిక అయకట్టు 16 వేల ఎకరాలు, అనధికారికంగా మరో తొమ్మిది వేల ఎకరాల్లో రైతులు వరి, పత్తి పైర్లు ప్రతి ఏటా సాగు చేస్తారు. ఈ ఏడాది ప్రాజెక్టులో ఉన్న 20 అడుగుల నీటితో పాటు, అవసరమైతే సోమశిల ప్రాజెక్టు నుంచి ఇంకా నీరు వచ్చే అవకాశం ఉంది. దీంతో రైతులకు సాగునీటికి ఎలాంటి సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం లేదు. అయినా రైతులు దాదాపు 9000 వేల ఎకరాల్లో వరి, 7000 ఎకరాల్లో పత్తి పైరు సాగు చేయనున్నట్లు ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు. ఇందులో లింగసముద్రం మండలంలో ఎక్కువగా ఎడమ కాలువ పరిధిలో 1300 ఎకరాలు, కుడి కాలువ పరిధిలో 7700 ఎకరాలలో లింగసముద్రం, కొండాపురం, గుడ్లూరు మండలాల్లోని పలు గ్రామాల రైతులు వరి సాగు చేయనున్నారు.

● ఖర్చు ఎక్కువైనా తిండికి, పశుగ్రాసం కోసం తప్పదు

వరి పైరు సాగుకు ఖర్చు ఎక్కువైనా, తిండి గింజలు, పశుగ్రాసం కోసం సాగు చేయక తప్పదని రైతులు చెబుతున్నారు. ఒక్కో ఎకరా వరి పైరు సాగుకు రూ.30 వేలకు పైబడి ఖర్చు అవుతుందని, దిగుబడులు, మద్దతు ధర ఆశాజనకంగా లేకపోయినా, తిండి గింజల కోసం, పశుగ్రాసానికి వరి పైరు పండించక తప్పదని రైతులు చెబుతున్నారు. పెద్దగా లాభాలు లేకపోయినా, ఈ రెండు కారణాలతో వరి సాగు చేస్తున్నట్లు చెబుతున్నారు. అందులోనూ ఈ సారి ఎక్కువగా కేఎన్‌ఎం 1630 రకం కొత్త వరి వంగడాన్ని సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. అయితే ఈ రకం వరి ఎకరాకు 25 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి అయ్యే అవకాశం ఉండగా క్వింటా ధర ప్రస్తుతం రూ.2000 కంటే తక్కువ ఉంది. దీంతో ఎకరాకు ఖర్చులు పోను రూ.15 వేల నుంచి రూ.20 వేల కంటే ఎక్కువ లాభాలు రావడం లేదు.

● గుడ్లూరు మండల పరిధిలో అధికంగా పత్తి సాగు

అయితే ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని లింగసముద్రం మండలంలోని అన్నెబోయినపల్లిలో సగం, సత్యనారాయణపురం, గుడ్లూరు మండల పరిధిలో సీతారాంపురం, పూరేటిపల్లి తదితర గ్రామాల రైతులు ఎక్కువగా పత్తి పైరు సాగు చేస్తారని అధికారులు తెలిపారు. ఈ భూములు ఎక్కువగా పత్తి పైరు సాగుకు అనుకూలంగా ఉంటాయని, పత్తి దిగుబడులు కూడా బాగుంటాయని అంటున్నారు. ఒక్కో ఎకరా పత్తి సాగుకు రూ.20 వేల నుంచి రూ25 వేలు ఖర్చు అయినప్పటికీ ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి ఉంటుంది. ప్రస్తుతం పత్తి క్వింటా రూ.7 వేల నుంచి రూ.8 వేల వరకు ఉంది. దీంతో ఎకరాకు ఖర్చులు పోను రూ.కనీసం రూ.50 వేల వరకు లాభాలు వచ్చే అవకాశం ఉంది. దీంతో పత్తి సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. కాగా అధిక శాతం పత్తిసాగుకు రైతులు మొగ్గు చూపుతుండడంతో ఈ ఏడాది వరి సాగు విస్తీర్ణం తగ్గుముఖం పడుతుండడంతో వరికి సాగు నీటి సమస్యలు వచ్చే అవకాశం లేదు.



అన్నెబోయినపల్లి మాగాణి భూముల్లో వరి నారుమడి

ఆంజనేయ స్వామి ఆలయంలో ధర్మ ధ్వజస్తంభం ప్రారంభం



ఆంజనేయస్వామి ఆలయం వద్ద ధర్మధ్వజస్తంభం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి

కావలిరూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రకోటలోని అయ్యప్పస్వామి ఆలయ ప్రాగణంలోని ఆంజనేయస్వామి ఆలయానికి భక్తుడు మూలంరెడ్డి కామేశ్వరరెడ్డి విరాళంతో ఏర్పాటు చేసిన ధర్మధ్వజస్తంభాన్ని సోమవారం ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ప్రారం భించారు. గ్రామానికి చేరుకున్న ఆయన అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతన గోశాల పనుల నిర్మాణంతో పాటు ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే ఇచ్చిన రూ.5 లక్షలతో నిర్మిస్తున్న ప్రహరీ నిర్మాణాన్ని, అన్నసంతర్పణ కార్యక్రమాన్ని పరిశీలిం చారు. ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తున్న ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కావలి కాలువకు నీటి విడుదల

జలదంకి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలం అన్నవరం వద్ద చిన్నక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి కావలి కాలువ దిగువ ప్రాంతానికి మంగళవారం ఉదయగిరి, కావలి ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, డీవీ.కృష్ణారెడ్డిలు సాగునీరు విడుదల చేయనున్నట్లు సోమశిల ప్రాజెక్టు వైస్‌చైర్మన్ పీ.మధుమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బ్యాలెన్సింగ్ రిజర్వాయరు ఔట్‌ఫాల్ గేట్లు ఎత్తి బ్రాహ్మణక్రాక, గౌరవరం మేజర్ కాలువలకు సాగునీరు విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని నీటి సంఘాల బాధ్యులు, కూటమి పార్టీ నాయకులు హాజరు కావాలని తెలిపారు.

బస్సు ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలి

● ఆర్టీవో మురళీధర్



ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఆర్టీవో మురళీధర్, అధికారులు

కావలి రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): బస్ ప్రమాదాల నియంత్రణ పట్ల పాఠశాలలు, కళాశాలల యజమానులు, డ్రైవర్లు అవగాహన కలిగి ఉండాలని ఆర్టీవో మురళీధర్ పేర్కొన్నారు. పట్టణ సమీపంలోని ముసునూరు టోల్‌ప్లాజా వద్ద సోమవారం అగ్నిప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకంపై వాహనదారులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్టీవో మాట్లాడుతూ బస్‌ల్లో అగ్ని ప్రమాదాల నియంత్రణ కిట్లతో పాటు మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని, ఎమర్జన్సీ డోర్లు పని చేసేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, బస్‌ల్లో ప్రయాణించే విద్యార్థులకు అగ్నిప్రమాదాల నియంత్రణ కిట్ల వాడకం, ప్రమాదాల సమయంలో ఎమర్జెనీ డోర్ల వాడకంపై అవగాహన కల్పిస్తుండాలని సూచించారు. పాఠశాలల బస్‌లు తనిఖీ చేసి ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు సుందరరావు, అసిస్టెంట్ ఎంవీఐలు కరుణాకర్, లక్ష్మీభాయ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించండి

● ఆర్డీవో కార్యాలయం వద్ద వినాయక కాలనీ వాసుల ధర్నా



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వినాయక కాలనీ వాసులు

కావలి(టౌన్), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 16వ వార్డు వినాయక కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య కోరారు. ఈ మేరకు సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో వినాయక కాలనీ వాసులు ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కాలనీలో 15 ఏళ్ల నుంచి దాదాపు 70 కుటుంబాలు నివాసముంటున్నప్పటికీ ఇప్పటికీ విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయకపోవడం దుర్మార్గమన్నారు. దీంతో చాలాదూరం నుంచి కర్రల సాయంతో స్వయంగా లైను ఏర్పాటు చేసుకుని బిల్లులు చెల్లిస్తున్నారన్నారు. గాలి, వర్షం వచ్చిన సందార్భాల్లో కర్రలు పడిపోయి లైను తెగిపోయి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందన్నారు. శాశ్వతంగా విద్యుత్ లైను లాగమని మున్సిపాలిటీ, విద్యుత్ శాఖ అధికారులకు అనేకమార్లు మొరపెట్టుకున్నప్పటికీ ప్రయోజనం లేదన్నారు. ఆర్డీవో దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లగా విద్యుత్ లైను ఏర్పాటుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణమోహన్, తిరుపాలు, వై మధు, కాలనీ పెద్దలు ఎం కొండయ్య, ఎస్‌కే సాబిర, అస్మత్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లిపాలెంలో ఉచిత వైద్య శిబిరం

ఉలవపాడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరేడు పంచాయతీ పెద్దపల్లిపాలెంలో సోమవారం నారాయణ ఆరోగ్యమస్తు పథకం ద్వారా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు గొల్లపోతు యానాది, టీడీపీ నాయకులు పాలుబోయిన శ్రీనివాసులు ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులకు కీళ్ల, ఎముకలు, కంటి, సాధారణ వ్యాధులకు సంబంధించి స్కానింగ్, రక్త పరీక్షలు నిర్వహించి శస్త్ర చికిత్స అవసరమైన వారిని ఉచిత బస్సులో నారాయణ వైద్యశాలకు తరలించినట్టు నిర్వహకులు తెలిపారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నారాయణ మెడికల్ కాలేజీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీలో పలు కుటుంబాల చేరిక



ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరుతున్న తెట్టు ఎస్టీ కాలనీ వాసులు

కందుకూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గుడ్లూరు మండలం తెట్టు ఎస్టీ కాలనీకి చెందిన పలు కుటుంబాల వారు వైసీపీని వీడి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో సోమవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయానికి వచ్చి టీడీపీలో చేరేందుకు సంసిద్ధత వ్యక్తం చేయగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తగా పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామని, పాత కొత్త నాయకులంతా కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. పార్టీలో చేరిన కన్నెగంటి చిన్నబ్బాయి, చేవూరి చెంచయ్య, పొట్లూరి సుబ్బయ్య, మానికల శివకృష్ణ, కన్నెగంటి శ్రీనివాసులు, చలంచర్ల శివ, యానాది, రమణమ్మ, నరసమ్మ తదితరులు మాట్లాడుతూ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధికి, పేదప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చేస్తున్న కృషికి ఆకర్షితులమై వైసీపీని వీడి టీడీపీలో చేరాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మద్దసాని శ్రీనివాసులు, గొత్తుల వెంకటరావు, గోచిపాతల కోటేశ్వరరావు, మద్దసాని వెంకటేశ్వర్లు, జాలరామయ్య, చిన్నబ్బులు, పెద్దబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు



హుండీలో కానుకలు లెక్కిస్తున్న భక్తులు

కావలి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతూరు మల్లేశ్వరస్వామి (శివాలయం) ఆలయం దేవాదాయశాఖలో కలిపిన తర్వాత తొలిసారిగా సోమవారం హుండీ లెక్కింపు జరిగింది. దేవాదాయశాఖ కోవూరు ఇన్‌స్పెక్టర్ కే.నాగమల్లేశ్వరరాజు సమక్షంలో ఆలయ ఈవో అరవ రాధాకృష్ణ, వ్యవస్థాపక ధర్మకర్త కసవరాజు క్రిష్ణ మోహన్, ప్రధాన అర్చకులు శశిగురుకుల్, సిబ్బంది, బ్యాంక్ సిబ్బంది, భక్తులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు. ఆలయంలో జూన్ 5న హుండీలు ఏర్పాటు చేశా రు. అప్పటి నుంచి 172 రోజుల తర్వాత హుండీ లెక్కింపు జరుగగా భ క్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.7.90 లక్షలు ఆదాయం వచ్చిం ది. వివిధ సేవలకు ఆన్‌లైన్ ద్వారా రూ.6.13 లక్షలు రాగా మొత్తం ఆలయానికి రూ.14.03 లక్షల ఆదాయం చేకూరిందని ఈవో తెలిపారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన



మాట్లాడుతున్న రెండవ పట్టణ ఎస్ఐ గౌస్‌బాషా

కావలి(టౌన్), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణ పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీలో సోమవారం జేబీ ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం, మాదక ద్రవ్యాల వాడకంపై అవగాహన సదస్సు జరిగింది. రెండవ పట్టణ ఎస్ఐ గౌస్‌బాషా మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాలు దుష్పరిమాణాల గురించి వివరించారు. డాక్టర్లు వెంకటేశ్వర్లుబాబు, మహేష్, మోహన్, మేఘనాథ్‌లు పాల్గొని కంటి వైద్యం, దంత ఆరోగ్యం, మధుమేహం, రక్తపోటు, సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేబీ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం నాయుడు, స్వయం ఉపాధి కోర్సుల సంచాలకులు మాల్యాద్రి, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్లు నాగేశ్వరరావు, అయూబ్, రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్ రెడ్డి, వీడీ ప్రసాద్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

● కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

ఉలవపాడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. సోమవారం పెద్దపట్టపుపాలెంలో రైతన్నా-మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇంటింటికి తిరిగి రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన పథకాలను తెలియజేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం జరిగిన గ్రామసభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే అన్నదాత సుఖీభవ నిధులు రెండో విడత విడుదల చేశారన్నారు. గ్రామాల్లో చెరువులు, పంట కాలువల పటిష్టతకు ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. రైతు రథం పథకం కింద వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు పంపిణీ చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. మత్స్యకారులకు అన్యాయం చేసేలా జగన్ తీసుకొచ్చిన 217 జీవోని కూటమి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి కే.శాంతి, పశుసంవర్ధక శాఖ ఏడీఏ సురేష్‌నాయుడు, వ్యవసాయశాఖ ఇన్‌చార్జ్ ఏడీఏ కేవీ.శేషారెడ్డి, ఏవో విజయ్‌కుమార్ పాల్గొన్నారు. తొలుత ఉలవపాడులోని జాతీయ రహదారిపై నూతనంగా నిర్మించిన మనిక్ రెస్టారెంట్‌ను ఎమ్మెల్యే ఇంటూరి ప్రారంభించి అక్కడి నుంచి కరేడు గ్రామంలో రూ.16 లక్షల నిధులతో సీసీ డ్రైన్ పనులకు శంకుస్థాపన చేశారు.

● **బిట్రగుంట :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతన్న మీ కోసం కార్యక్రమంలో భాగంగా సోమవారం బోగోలు మండలం విశ్వనాథరావుపేటలో మండల వ్యవసాయాధికారి బీ.శైలజ రైతు సంక్షేమ పథకాలపై రైతులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, కావలి ఏఎంసీ డైరెక్టర్ ఎల్.సుధీర్ బాబు, రైతు నేతలు సనిగంటి శ్రీనివాసులు, తోట సాయి ప్రసాద్, ఇందుపూరు తిరుపతిరెడ్డి, వీఆర్వో రాంమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.



కొండాపురం : పథకాల కరపత్రాలు రైతులకు అందచేస్తున్న సచివాలయ ఉద్యోగి నరేంద్ర

● **కొండాపురం :** మండలంలోని సాయిపేట పంచాయతీ మక్కెనవారిపాలెంలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని సచివాలయ వీఏఏ నరేంద్ర నిర్వహించారు. రైతులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా టెలికాం అడ్వైజరీ బోర్డు మెంబరు తాటికొండ అనూష, గ్రామ రైతులు పాల్గొన్నారు.

నేడు పూరేటిపల్లిలో..

● **గుడ్లూరు :** మండలంలోని పూరేటిపల్లిలో మంగళవారం నిర్వహించనున్న రైతన్న మీకోసం కార్యక్రమంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొంటారని మండల వ్యవసాయ శాఖ అధికారి రవికుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రైతులు విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

గ్రావెల్ టిప్పర్లు, ఎక్స్‌కవేటర్ పట్టిస్తే.. వదిలేస్తారా?

● దళితులంటే అంత చులకనా? ● ఆర్డీవో కార్యాలయంలో నేలపై కూర్చుని నిరసన తెలిపిన దళిత సంఘం నేతలు

కావలి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కావలి రూరల్ ప్రాంతంలోని రుద్రకోటలో దళితుల భూముల్లో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్లు, ఎక్స్‌కవేటర్‌ను దళితులు పట్టుకుని అధికారులకు అప్పగిస్తే వాటిని వదిలి వేస్తారా..? దళితులంటే ఇంత చులకనా.. అంటూ దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాగంగా రుద్రకోట దళితులతో కలిసి కావలి ఆర్డీవో ఎం. సన్నీ వంశీక్రిష్ణకు వినతిపత్రం అందచేశారు. దళితలు పట్టించిన టిప్పర్లను అధికారులు వదిలివేయడాన్ని నిరసిస్తూ ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో నేలపై కూర్చుని నిరసన తెలిపారు.



ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో నేలపై కూర్చుని నిరసన తెలుపుతున్న దళిత నేతలు

అనంతరం మల్లి మాట్లాడుతూ ఈనెల 21న రుద్రకోటలో దళితులకు ఇచ్చిన సీజేఎఫ్‌ఎస్ భూములలో 350 ఎకరాలలో గ్రావెల్ అక్రమంగా కావలికి తరలిస్తుండగా ఆగ్రామ దళితుల వాటిని అడ్డుకుని అధికారులకు అప్పగించారన్నారు. అధికారులు ఎలాంటి ఒత్తిడిలకు గురయ్యారో తెలియదు కానీ వాటిని వెంటనే వదిలేశారన్నారు. దళితలు భూములలో తీసుకెళ్లుతున్న గ్రావెల్‌ను కూడా అడ్డుకునే హక్కు దళితులకు ఉందా లేదా అని ప్రశ్నించారు. దీనిపై స్పందించిన ఆర్డీవో సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత నేతలు ముక్కు గోపాల్, ముక్కు శ్రీనివాసులు, లక్ష్మయ్య, వాసు, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

పన్ను బకాయిలు చెల్లించకుంటే కుళాయి కనెక్షన్ కట్

కందుకూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మున్సిపాలిటీలో ఇంటి పన్ను, మంచినీటి కుళాయి పన్ను బకాయిలు చెల్లించని వారి కుళాయి కనెక్షన్లు కట్ చేయాలని నిర్ణయించినట్లు మున్సిపల్ కమిషనర్ కే.అనూష తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది మార్చికి ముందు బకాయిలు ఉన్నవారి కనెక్షన్లు కట్ చేయటం జరుగుతుందని, అలాంటివారంతా తక్షణం బకాయిలు మొత్తాన్ని మున్సిపల్ కార్యాలయంలోని కౌంటర్‌లో, వార్డు సచివాలయాలు, సీడీఎంఏ వెబ్‌సైట్ ద్వారా, పురమిత్ర యాప్ ద్వారా కానీ చెల్లించవచ్చునని ఆమె తెలిపారు.

● పీజీఆర్‌ఎస్‌కు 5 అర్జీలు

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల కార్యక్రమంలో 5 అర్జీలు వచ్చాయి. రోడ్లు, పారిశుద్ధ్యం తదితర సమస్యలపై వచ్చిన ఫిర్యాదులపై తక్షణం పరిష్కారంకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ కె.అనూష ఆయా సెక్షన్ హెడ్స్‌కు ఆదేశాలు జారీ చేశారు. పారిశుద్ధ్యం, ఇతర సమస్యలపై 9177700267 నెంబరుకు ఫోన్‌చేసి తెలియజేసినా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



అర్జీలు స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ అనూష

ఈసారి గోదాముల్లోనే..

(5వ పేజీ తరువాయి)

పౌరసరఫరాల అధికారి, అసిస్టెంట్ పౌరసరఫరాల అధికారిపైనా వేటు పడింది. ఆ సంస్థ అధికారులకు మందలింపులు కూడా వచ్చాయి. అయినా ఆ శాఖలోని అధికారుల తీరులో మార్పు రాలేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికీ నెల్లూరు, కావలి కేంద్రంగా ప్రతీ నెలా వేల టన్నుల బియ్యం రీసైక్లింగ్ జరిగి మార్కెట్లోకి వస్తోంది. అయితే అధికారులపై వేటు పడింది కానీ ఇందుకు సూత్రధారులైన రేషన్ మాఫియాపై మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

● అక్కడ ఎవరికి వారే!

జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో పాలన పూర్తిగా గాడి తప్పిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అక్కడ నడిపించే వారు లేకపోవడంతో ఎవరికి వారుగా వ్యవహరిస్తున్నారని, ఇది ఉద్యోగుల మధ్య వివాదాలకు దారితీస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. ఇటీవల వరకూ రెగ్యులర్ డీఎస్‌వోగా పనిచేసిన విజయ్‌కుమార్‌ను ప్రభుత్వం రేషన్ బియ్యం పక్కదారి పట్టిన వ్యవహారంలో బదిలీ చేసింది. అలానే ఆ కార్యాలయంలో పని చేస్తున్న ఏఎస్‌వోను కూడా వేరే జిల్లాకు పంపింది. ఆ తర్వాత రెగ్యులర్ అధికారిని నియమించలేదు. కొన్ని రోజుల తర్వాత మెప్మా పీడీకి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఆమె ఇక్కడ పూర్తిగా దృష్టి పెట్టలేకపోతుండడంతో ఆ కార్యాలయంలో పనిచేసే ఓ ఉద్యోగి కర్రపెత్తనం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల రేషన్ షాపులు, పెట్రోల్ బంకుల తనిఖీలను పూర్తిగా విస్మరించారని, రికార్డుల్లో మాత్రం నమోదు చేసుకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక సివిల్ సప్లయిస్ డీఎం కార్యాలయంలో కూడా పాలన అస్తవ్యస్తంగా ఉందన్న ప్రచారం జరుగుతోంది.

రోజంతా పంచమి ప్రభావం ఉంటుందన్న టీటీడీ

తిరుచానూరుకు భారీగా చేరుకున్న భక్తులు

నేటి రాత్రి ధ్వజావరోహణంతో ముగియనున్న బ్రహ్మోత్సవాలు









సోమవారం రాత్రే హోల్డింగ్ పాయింట్‌కు చేరుకున్న భక్తులు

నేడే పంచమి తీర్థం

● మధ్యాహ్నం 12.10 గంటలకు చక్రస్నానం

అశ్వ వాహనంపై కల్కిగా.. : చెర్నాకోలు చేతపట్టి.. అశ్వ వాహనంపై కల్కి రూపంలో పద్మావతీ దేవి భక్తులను కటాక్షించారు. తిరుచానూరు అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో సోమవారం రాత్రి అమ్మవారు అశ్వవాహనంపై మాడవీధుల్లో ఊరేగారు. దీంతో ఈనెల 17న రాత్రి చిన్నశేషుడితో మొదలైన అమ్మవారి వాహన సేవలు ముగిశాయి. గడిచిన ఎనిమిది రోజుల్లో 16 వాహనాలపై వివిధ రూపాల్లో అమ్మవారు మాడవీధుల్లో ఊరేగారు. ఆయా కార్యక్రమాల్లో జీయర్ స్వాములు, టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, జానకిదేవి, శాంతారాం, నరేష్‌కుమార్, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో హరీంధర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై ఊరేగుతున్న అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బ్రహ్మోత్సవాల్లో నేడు
మధ్యాహ్నం 12.10 గంటలు: పద్మసరోవరంలో చక్రస్నానం
రాత్రి 9.30 గంటలు: ధ్వజావరోహణం

తిరుచానూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన పంచమితీర్థం (చక్రస్నానం) మంగళవారం జరగనుంది. ఉదయం అమ్మవారి ఉత్సవమూర్తిని, చక్రత్తాళ్వార్‌ను ఆలయం నుంచి వేంచేపుగా పంచమితీర్థం మండపానికి తీసుకురానున్నారు. పది గంటలకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12.10 గంటలకు.. అభిజిత్ కుంభ లగ్నంలో చక్రత్తాళ్వార్‌ను అర్చకులు పుష్కరిణిలో మునక వేయించనున్నారు. ఆ తర్వాత భక్తులు పుష్కరిణి స్నానాలను ఆచరించనున్నారు. లక్ష మందికిపైగా భక్తులు పుష్కర స్నానం చేయనున్నారు. తదనుగుణంగా టీటీడీ ఏర్పాట్లు చేపట్టింది. చక్రస్నానం జరిగే ప్రాంతంలో స్టీల్‌తో గ్రిల్స్ అమర్చారు. వీవీఐపీలకు, వీఐపీలకు, మీడియాకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. చక్రస్నానానికి వచ్చే భక్తులకు అల్పాహారం, పాలు, బిస్కెట్లను టీటీడీ అందించనుంది. రోజంతా పంచమి ప్రభావం ఉంటుందని, భక్తులు సంయమనంతో పుష్కర స్నానం ఆచరించాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. మంగళవారం రాత్రి జరిగే ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

హోల్డింగ్ పాయింట్‌కొస్తేనే పుష్కరిణికి..

తిరుపతి నుంచి వచ్చే వారికి నవజీవన్ ఆస్పత్రి వద్ద. పూడి నుంచి వచ్చేవారికి స్వర్ణముఖినది ఒడ్డున గోశాల వద్ద. మరొకటి జడ్పీ హైస్కూల్ వద్ద హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. ఈ హోల్డింగ్ పాయింట్ల నుంచే పుష్కరిణి స్నానాలకు అనుమతిస్తారు. ప్రతి హోల్డింగ్ పాయింట్ నుంచి వచ్చే క్యూలైన్లను గేట్ నెంబరు 4కు అనుసంధానం చేశారు. అక్కడ్నుంచి పుష్కరిణిలోకి భక్తులను వదులుతారు. కాగా, సోమవారం రాత్రికే భక్తులు భారీ ఎత్తున హోల్డింగ్ పాయింట్లకు చేరుకున్నారు. వీరిని మంగళవారం ఉదయం 10గంటలకుపైగా పుష్కరిణిలోకి అనుమతించనున్నారు.

పార్కింగ్ కేంద్రాలు

పంచమి తీర్థానికి వచ్చే భక్తులకు శిల్పారామం, మార్కెట్‌యార్డు, తనపల్లి రోడ్డు, నారాయణాద్రి ఆస్పత్రిరోడ్డు, ముండ్లపూడి వద్ద పార్కింగ్‌కేంద్రాలను ఏర్పాటు చేశారు. భక్తులు తమ వాహనాలను అక్కడ ఆపి హోల్డింగ్ పాయింట్లకు చేరుకోవాలి. ఇక సోమవారం రాత్రి 10గంటల నుంచి మంగళవారం సాయంత్రం వరకు తిరుచానూరులోకి వాహనాలను అనుమతించడం లేదు.

పుష్కరిణి చుట్టూ పటిష్ఠ నిఘా

పంచమితీర్థం సందర్భంగా దాదాపు రెండు వేల మందితో పోలీసుశాఖ భారీ బందోబస్తు ఏర్పాటుచేసింది. పుష్కరిణి, ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఆలయం, పుష్కరిణి పరిసరాలను పరిశీలించడానికి ప్రత్యేక సిబ్బందిని నియమించారు. ఎక్కడైనా సమస్య తలెత్తితే వైర్‌లెస్ సెట్ ద్వారా పోలీసులను అప్రమత్తం చేస్తారు.

రైతన్నా.. మీకోసం

ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించిన కలెక్టర్

రేణిగుంట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమంలో భాగంగా సోమవారం రేణిగుంట మండలం గాజులమండ్యంలో కలెక్టర్ వెంకటేశ్వర్ పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి రైతు ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. రైతు సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం గత ఒకటిన్నర సంవత్సరంలో పలు పథకాలు అమలు చేసిందని గుర్తుచేశారు. ప్రతి పథకం రైతు ఇంటి వద్దకు చేరేలా ఈనెల 29వ తేదీ వరకు గ్రామ సచివాలయ సిబ్బంది అవగాహన కల్పిస్తారన్నారు. జిల్లాలో 20 వేల టన్నుల యూరియా అందుబాటులో ఉండగా, ఇప్పటివరకు 12,500 టన్నులు పంపిణీ చేశామన్నారు. కనీసం మద్దతు ధర కంటే తక్కువకే ధాన్యం విక్రయించాల్సిన పరిస్థితి రాకుండా ప్రతి గింజను ప్రభుత్వమే కొంటుందన్నారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురిసినందున రెండు పంటలు వేసుకునే అవకాశం ఉందన్నారు. కూలీల కొరతను తగ్గించేందుకు సీహెచ్‌సీల ద్వారా తక్కువ ఖర్చుతో యంత్రాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. డ్రోన్ సాయంతో ఎకరాకు 6నిమిషాల్లో ఎరువుల పిచికారీ పూర్తి చేయవచ్చన్నారు. మామిడి, వేరుశనగ పంటలకు డ్రిప్, స్ప్రింక్లర్లను రాయితీపై అందిస్తున్నామన్నారు. ఏ పంట వేసేదీ ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసి పంట బుకింగ్ వ్యవస్థను బలోపేతం చేశామన్నారు. ఆర్డీవోలు భానుప్రకాష్‌రెడ్డి, ప్రసాదరావు, ఏవో సునీల్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, రెవెన్యూ, మత్స్య శాఖ, సిబ్బంది, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



గాజులమండ్యంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

సమస్యలపై అధ్యయనానికి

ప్రత్యేక బృందాలు

● సదరన్ డిస్కం సీఎండీ శివశంకర్

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'లో ఓల్టేజ్.. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు వస్తున్నాయని వినియోగదారుల నుంచి ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి. వీటిపై సాంకేతిక సమస్యలను అధ్యయనం చేసి పరిష్కరించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం' అని సదరన్ డిస్కం సీఎండీ శివశంకర్ తెలిపారు. తిరుపతిలోని సదరన్ డిస్కం కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహించారు. డిస్కం పరిధిలోని 65 మంది వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వచ్చాయన్నారు. క్షేత్ర స్థాయిలో వినియోగదారుల సమస్యలు పరిష్కరించడంలో సిబ్బంది నిర్లక్ష్యం జరుగుతోందని, అనతికాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకొంటామని ఆయన చెప్పారు. డయల్ యువర్ సీఎండీ కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చే చిన్న సమస్యలతో పాటు పెద్దవీ త్వరితగతిన పరిష్కారమవుతున్నాయని చెప్పారు. సీజీఎంలు, జీఎంలు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో దీర్ఘకాలంగా పరిష్కారం కాని సమస్యలను తన దృష్టికి తెస్తే, తగిన ప్రాధాన్యమిచ్చి, వీలైనంత త్వరగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటి వరకు వచ్చిన సమస్యల్లో, సాంకేతిక పరమైన సమస్యలు మినహా మిగిలినవి పరిష్కరించామన్నారు. వినియోగదారుల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఎండీ హెచ్చరించారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను టోల్ ఫ్రీ నెంబర్లు 1912, 1800 425155333 కి డయల్ చేసి... 91333 31912 నెంబరుకు చాట్ చేస్తే సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కె. గురవయ్య, పి.అయూబ్‌ఖాన్, కె.రామమోహనరావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణాదేవి, పి.హెచ్.జానకిరామ్, ఎం.మురళీకుమార్, పి.సురేంద్ర నాయుడు, కె.ఆదిశేషయ్య, ఎం.ఉమాపతి, జీఎంలు ఎం.కృష్ణారెడ్డి, రామచంద్ర రావు, జి.చక్రపాణి, డి.సురేంద్రరావు, పి.భాస్కర్‌రెడ్డి, విజయన్, జగదీష్ పాల్గొన్నారు.



విద్యుత్ వినియోగదారుల సమస్యలను వింటున్న సీఎండీ

సింగపూర్ పర్యటనకు

ముగ్గురు ఉపాధ్యాయులు

తిరుపతి(విద్య), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఉపాధ్యాయులుగా రాష్ట్ర పురస్కారాలు అందుకున్న ముగ్గురు ఉపాధ్యాయులు సింగపూర్ పర్యటనకు వెళ్లనున్నారు. సింగపూర్ విద్యావ్యవస్థ ప్రపంచ స్థాయిలో ఉత్తమ విద్యావ్యవస్థగా గుర్తింపు పొందింది. ఈ నేపథ్యంలో సింగపూర్‌లో అత్యుత్తమ విద్యావిధానాలను అధ్యయనంచేసి... వాటిని మన రాష్ట్రంలోకూడా అమలుచేసి మన విద్యావ్యవస్థను మరింత మెరుగుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయులను సింగపూర్ పంపిస్తోంది. ఈ క్రమంలో శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు జడ్పీహెచ్ఎస్ ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ డాక్టర్ ఎన్.సుబ్రమణ్యశర్మ, తొట్టంబేడు మండలం దిగువ సాంబయ్యపాళెం ఫౌండేషన్ స్కూల్ సెకండరీ గ్రేడ్ టీచర్ కయ్యూరు బాలసుబ్రమణ్యం, శ్రీకాళహస్తి మండలం ఎగువ వీధి జడ్పీహెచ్ఎస్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ ఎస్.రామకృష్ణ సింగపూర్ వెళ్లేవారిలో ఉన్నారు. ఈనెల 27 నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు వీరి పర్యటన కొనసాగనుంది. సింగపూర్‌లోని ప్రధాన పాఠశాలల్లో అత్యాధునిక బోధనా విధానాలు, క్లాస్‌రూమ్ వాతావరణం, టెక్నాలజీ ఆధారిత బోధనా విధానాలు, బోధనేతర పద్ధతులు, కరిక్యులం, తరగతి గదుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య అనుబంధం తదితర అంశాలను పరిశీలించి తదుపరి ఆయా అంశాల గురించి, రాష్ట్రంలో ఆయా విధానాలను ఎలా అమలు చేయొచ్చన్న దానిపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారు.



డాక్టర్ సుబ్రమణ్య శర్మ, కయ్యూరు బాలసుబ్రమణ్యం, ఎస్.రామకృష్ణ

- పది పరీక్షల సమస్యల పరిష్కారానికి

ప్రత్యేక గ్రీవెన్స్ సెల్

తిరుపతి(విద్య), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రానున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి సందేహాల నివృత్తి, సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేసినట్టు డీఈవో కేవీఎన్ కుమార్ వెల్లడించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సందేహాలు, సమస్యలను సత్వరం పరిష్కరించేలా ఐదుగురు సబ్జెక్ట్ నిపుణులను సెల్‌లో నియమించారు. ఏసీజీఈ పి. గురుస్వామిరెడ్డి (సెల్ నం: 94403 11629),సూపరింటెండెంట్ పి.రాఘవేంద్రరావు (79892 50005), సీనియర్ అసిస్టెంట్ పి.శరీష్‌కుమార్ (96528 86699),ఏపీవో ఐ.దాము(91823 21491)ను ఆయా సెల్‌ఫోన్ నంబర్లలో సంప్రదించి విద్యార్థులు, తల్లిదండ్రులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

ఇద్దరిపై పీడీ యాక్టు!

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇద్దరిపై పీడీ యాక్టు నమోదుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. వివిధ నేరాలకు సంబంధించి తిరుపతి నగరం కొర్లగుంట మారుతినగర్‌కు చెందిన సయ్యద్ అజీమ్, పులిచెర్ల మండలవాసి, ప్రస్తుతం తిరుపతి నగరంలోని ఉద్యోగనగర్‌లో నివాసం ఉంటున్న వట్టికుంట అరుణ్‌కుమార్ అలియాస్ అరుణ్‌పై పీడీ యాక్టు నమోదుకు కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రభుత్వానికి లేఖ రాశారు. దీనికి ఆమోదం తెలుపుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

తిరుపతి మీదుగా మరో వందేభారత్

● విజయవాడ నుంచి బెంగళూరుకు 10న ప్రారంభం



చిత్తూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదు-తిరుపతి మధ్య వందేభారత్ రైలు నడుస్తోంది. తాజాగా విజయవాడ నుంచి తిరుపతి, చిత్తూరు మీదుగా బెంగళూరు వరకు మరో వందేభారత్ నడవనుంది. డిసెంబరు పది నుంచి దీనిని నడిపేందుకు ముహూర్తం ఖరారు చేశారు. ఈ రైలు ద్వారా విజయవాడ నుంచి బెంగళూరుకు 9 గంటల్లోనే చేరుకునే అవకాశం ఉంది. మొత్తం 8 బోగీల్లో.. 7 ఏసీ చైర్‌కార్, ఒకటి ఎగ్జిక్యూటివ్ చైర్‌కార్ ఉంటాయి.డిసెంబరు 10 నుంచి మంగళవారం మినహా అన్ని రోజుల్లో ఇది ప్రయాణిస్తుంది. విజయవాడలో తెల్లవారుజామున 5.15 గంటలకు బయల్దేరి తెనాలి, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి మీదుగా 10.27 గంటలకు చిత్తూరు చేరుకుంటుంది. ఇక్కడి నుంచి కాట్పాడి జంక్షన్, కేఆర్ పురం మీదుగా బెంగుళూరు (ఎస్ఎంవీటీ)కి మధ్యాహ్నం 1.15 గంటలకు చేరుతుంది. తిరిగి ఈ రైలు బెంగళూరులో మధ్యాహ్నం 2.45 గంటలకు బయల్దేరి చిత్తూరుకు సాయంత్రం 5.49 గంటలకు చేరుకుంటుంది. ఇక్కడి నుంచి రాత్రి 11.45 గంటలకు విజయవాడకు చేరుకుంటుంది. విజయవాడ, బెంగళూరు నుంచి తిరుమల వెళ్లే భక్తులకు ఈ రైలు బాగా ఉపయోగపడనుంది.

జిల్లాలో తేలికపాటి వర్షం

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): బంగాళఖాతంలో అల్పపీడనం కారణంగా సోమవారం జిల్లాలో తేలికపాటి వర్షం కురిసింది. బీఎన్‌కండ్రిగమండలంలో 40.2 మి.మీ., కేవీబీపురం33.8, చిల్లకూరు 22.8, తిరుపతి(అర్బన్)20.2, చంద్రగిరిలో 18.6 మి.మీల వర్షపాతం నమోదైంది. మంగళ, బుధవారాల్లో జిల్లాలో భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

మాల్వాడిగుండం వద్ద బోల్తాపడిన కారు

● ముగ్గురికి స్వల్ప గాయాలు


ప్రమాదానికి గురైన కారు

తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులో సోమవారం ఓ కారు బోల్తాపడింది. తమిళనాడుకు చెందిన కుటుంబం దర్శనం పూర్తిచేసుకుని తిరుగు ప్రయాణం కాగా మాల్వాడి గుండంకు సమీపంలో కారు అదుపుతప్పి బోల్తాపడింది. ముగ్గురు భక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

టీటీడీకి రూ.20 లక్షల వినికిడి యంత్రాలు



టీటీడీకి రూ.20 లక్షల విలువైన 105 వినికిడి యంత్రాలు సోమవారం విరాళంగా అందాయి. తిరుపతికి చెందిన ఎన్ విరాట్ తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌కు వీటిని అందజేశారు. శ్రవణం ప్రాజెక్ట్‌లో శిక్షణ పూర్తిచేసుకుని బయటకు వెళ్లే పిల్లలకు ఈ వినికిడి యంత్రాలను అందజేస్తారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలోని 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.61 కోట్లు
ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,974
తలనీలాలు సమర్పించినవారు: 28,995



మహారథంపై బ్రహ్మాండనాయకి


రథంపై చల్లిన మిరియాలు ఏరుకుంటున్న భక్తులు









ముత్యపు కవచపు అలంకారంలో.. సర్వస్వతంత్ర వీరలక్ష్మిగా పద్మావతి అమ్మవారు మహారథంపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన సోమవారం ఉదయం అమ్మవారికి రథోత్సవం జరిగింది. ఈ సందర్భంగా వేకువజామున అమ్మవారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. రథబలి కైంకర్యం నిర్వహించాక ఉత్సవమూర్తిని వేంచేపుగా రథమండపానికి తీసుకొచ్చారు. ఉదయం 9.15గంటలకు ధనుర్లగ్నంలో ముత్యపుకవచంతో ప్రసన్నమూర్తిగా అమ్మవారు రథంపై కొలువు దీరి భక్తులను కటాక్షించారు. భక్తుల గోవిందనామస్మరణల నడుమ ఆధ్యాత్మిక వాతావరణంలో రథం ముందుకుసాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు రథాన్ని లాగారు. ఇక, రథంపై మిరియాలు, ఉప్పు చల్లి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు రథ మండపంలో అమ్మవారికి స్నపన తిరుమంజనం, సాయంత్రం ఆస్థాన మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. - తిరుచానూరు, ఆంధ్రజ్యోతి









పుష్కరిణి వద్ద ఏర్పాట్ల పరిశీలన



తిరుచానూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో మంగళవారం పంచమి తీర్థం జరగనుంది. ఈ నేపథ్యంలో జేఈవో వీరబ్రహ్మం, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ తదితరులు సోమవారం అమ్మవారి పుష్కరిణి, ఆలయ మాడవీధులు పరిశీలించారు. చక్ర స్నానం సందర్భంగా ఎస్డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు కూడా భద్రతా చర్యల్లో పాల్గొంటాయన్నారు. అంతకుముందు శిల్పారామంలో బందోబస్తు విధులకు వచ్చిన పోలీసులకు ఎస్పీ దిశానిర్దేశం చేశారు. భక్తులతో మర్యాదగా మెలగాలని, చిన్న సంఘటన జరిగినా ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. పిల్లలు, వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నేడు ధ్వజావరోహణం, రేపు పుష్పయాగం

తిరుచానూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మంగళవారం రాత్రి బంగారు తిరుచ్చిపై అమ్మవారు తిరువీధుల్లో విహరిస్తారు. అనంతరం పాంచరాత్ర ఆగమశాస్త్రోక్తంగా ధ్వజస్తంభంపై ఉన్న గజచిత్రపటాన్ని అర్చకులు అవరోహణ చేయడంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. బుధవారం సాయంత్రం అమ్మవారికి పుష్పయాగం నిర్వహించనున్నారు. భక్తులు టిక్కెట్లు కొని పాల్గొనవచ్చు.

నేడు బంగారు చీరలో అమ్మవారి దర్శనం

పంచమితీర్థం సందర్భంగా అమ్మవారు మంగళవారం బంగారు చీరలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. 12 ఏళ్ల కిందట రూ.3 కోట్ల విలువ చేసే ఈ బంగారు పట్టుచీరను గుంటూరుకు చెందిన ఓ దాత సమర్పించారు. అప్పటి నుంచి బంగారు చీరను అమ్మవారికి కడుతున్నారు.

నేడు అమ్మవారికి అయ్యవారి సారె

తిరుమల/తిరుచానూరు, నవంబరు24(ఆంధ్రజ్యోతి): పంచమితీర్థం సందర్భంగా తిరుమల శ్రీవారి తరపున మంగళవారం అమ్మవారికి సారె పంపనున్నారు. శ్రీవారి ఆలయం నుంచి వేకువజామున పసుపు, కుంకుమ, ప్రసాదాలు, తులసి, వస్త్రాలు, ఆభరణాలతో కూడి సారెను ఆలయ నాలుగు మాడవీధుల గుండా ఊరేగిస్తారు. ఈ సారెతో టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, ఏకాంగులు, అర్చకులు, పరిచారకులు కాలిమార్గాన అలిపిరికి చేరుకుంటారు. అక్కడ వారికి అమ్మవారి ప్రతినిధిగా తిరుపతి జేఈవో వీరబ్రహ్మం స్వాగతం పలుకుతారు. అక్కడి నుంచి ఏనుగు అంబారిపై ఊరేగింపుగా కోమలమ్మ సత్రం, కోదండరామాలయం, గోవిందరాజస్వామి ఆలయం, ఆర్టీసీ బస్టాండు, లక్ష్మీపురం మీదుగా అమ్మవారి ఆలయానికి.. అక్కడ్నుంచి పంచమితీర్థం మండపానికి తీసుకొస్తారు. సారెలోని పసుపు, చందనం తదితరాలతో ఉత్సవమూర్తి, చక్రత్తాళ్వార్‌కు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు.

నేడు ఎస్వీయూకు సెలవు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పంచమి తీర్థం సందర్భంగా ఎస్వీయూకు మంగళవారం సెలవు ప్రకటించారు. ఈ మేరకు రిజిస్ట్రార్ మాదాల భూపతి నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు.

పంచమితీర్థానికి 40బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో మంగళవారం జరిగే పంచమితీర్థానికి హాజరయ్యే భక్తులకోసం 40 బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం విశ్వనాథం తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి సీబీఎస్‌లో ఈ బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. బస్టాండు, లక్ష్మీపురం కూడలి, మామిడికాయల మండీ, జాతీయ రహదారి, ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి తిరుగు ప్రయాణమవుతాయన్నారు నిమిషానికో బస్సు అందుబాటులో ఉంటుందన్నారు.

ప్రతి అర్జీకీ పరిష్కారం చూపాలి


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువన్షి, డీఆర్వో నరసింహులు

● కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు

288 వినతులు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు 288 వినతులు వచ్చాయి. అందులో రెవెన్యూ శాఖవే 196 ఉన్నాయి. ఈ వినతులను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశీ, డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు అర్జీలు స్వీకరించారు.

నకిలీ పాసుపుస్తకాలతో భూమి కాజేయాలని చూస్తున్నారు



సర్వే నెంబరు 35/2లోని భూములను మేము కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్నాం. పుత్తూరుకు చెందిన ఎంఎస్ కదిరివేలు ఆ భూములకు నకిలీ పాసుపుస్తకాలు సృష్టించి మమ్మల్ని రాన్వికుండా చేస్తున్నారు. దౌర్జన్యానికి పాల్పడుతున్నాడు. అతడిపై చర్యలు తీసుకుని మాకు న్యాయం చేయండి.

- గోపాలకృష్ణాపురం ఎస్టీకాలనీవాసులు, పుత్తూరు మండలం

మా భూమిని ఆక్రమించాలని చూస్తున్నారు

తిరుచానూరు గ్రామ పరిధిలోని యోగిమల్లవరం సర్వే నెంబరు 11లో నాకు నాలుగు సెంట్ల స్థలముంది. 2.5 సెంట్లలో ఇల్లు కట్టుకుని, మిగిలిన దాంట్లో ఆవుల కోసం రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకున్నా. అందులో 1.50సెంట్లు పక్కనే ఉన్న పొక్కాలమ్మ గుడికి చెందిందని చెప్పి నన్ను ఇబ్బంది పెడుతున్నారు. విచారించి న్యాయం చేయండి.

- నారాయణ, యోగిమల్లవరం, తిరుచానూరు పంచాయతీ

రీ వెరిఫికేషన్‌తో మనోభావాలు దెబ్బతీశారు

గతంలో సదరం సర్టిఫికెట్లలో 70 శాతానికిపైగా వికలత్వం ఇచ్చారు. రీవెరిఫికేషన్ పేరుతో ఇప్పుడు దాన్ని 50 శాతానికి తగ్గించి మా మనోభావాలను దెబ్బతీశారని దివ్యాంగుల సేవా సమితి సభ్యులు శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, మురళి, శోభన్‌బాబు అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపాలిటీ పరిధిలో సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ సర్టిఫికెట్లపై అధికారులు సంతకం పెట్టడం లేదని, మూడు చక్రాల మోటార్ సైకిళ్ల దరఖాస్తుకు గడువు పెంచాలని కోరారు.

జూనియర్ కళాశాలకు ప్రహరీ నిర్మించండి



పిచ్చాటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరీ నిర్మించాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. ఈ మేరకు పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రహరీ లేకపోవడంతో రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, విష పురుగులు చొరబడుతున్నాయన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి : ఏపీ సమగ్రశిక్ష కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, జీతాలు పెంచాలని ఫెడరేషన్ జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, జీతాలు పెంచి సమయానికి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.రిటైర్‌మెంట్ వయసు 62కు పెంచాలన్నారు. అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ఇళ్ల పట్టాలివ్వండి : తాము రెండేళ్ల క్రితం నిర్మించుకున్న ఇళ్లకు పట్టాలివ్వాలని వెంకటగిరి మండలం పెట్లూరు పంచాయతీ సీతారాం ఏచూరి నగర్ వాసులు కోరారు. సర్వే నెంబరు 12/1లో 2011 నుంచి నివాసముంటున్నా పట్టా ఇవ్వలేదని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి అది రిజర్వ్ ఫారెస్టుగా ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారని పేర్కొన్నారు. అది పశువుల మేత భూమిగా తహసీల్దారు ఎండార్స్‌మెంట్ కాపీని తమకు ఇచ్చారని వివరించారు. అనాధీనంగా మార్చి తమకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు.

పెచ్చులూడిన కలెక్టరేట్ మెట్లు



కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుండగా మధ్యాహ్నం 12.20 గంటల సమయంలో బ్లాక్ బి వద్ద మొదటి అంతస్థుకు వెళ్లేమార్గంలో మెట్లు పెచ్చులూడి పడ్డాయి. దీంతో అధికారులు, అర్జీదారులు ఉలిక్కిపడ్డారు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడం ప్రమాదం తప్పింది.

వినుత దంపతులే హతమార్చి ఉంటారు!

● రాయుడి సోదరి కీర్తిప్రియ ఆరోపణ



శ్రీకాళహస్తి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తన అన్న రాయుడు అలియాస్ శ్రీనివాసులును శ్రీకాళహస్తి జనసేన నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి వినుత వాళ్లే హతమార్చి ఉంటారని కీర్తిప్రియ ఆరోపించారు. దీనిపై సోమవారం ఆమె వీడియో విడుదల చేశారు. 'వినుత వాళ్లే మా అన్న రాయుడిని హత్య చేసి ఉంటారని బలంగా అనుమానిస్తున్నా. ఎమ్మెల్యే సుధీర్‌పై వినుత దంపతుల ఆరోపణలకు ఎలాంటి పొంతన కుదరడం లేదు. ఎమ్మెల్యే పాత్ర నిజమైతే రాయుడిని చంపకుండా సాక్ష్యాలను బహిర్గతం చేసి ఉండొచ్చు. అలా కాకుండా అప్పుడప్పుడు వీడియోలను వదులుతూ ఆరోపణలు చేయడంపై అనుమానం కలుగుతోంది. ఎన్నో లక్షలు ఖర్చు పెట్టి రాయుడి వీడియోలను రికవరీ చేశామని వినుత వర్గం చెప్పుకోవడం ద్వారా.. వాళ్లే చనిపోయిన రాయుడు వీడియోలను సృష్టిస్తున్నారన్న అనుమానం వస్తోంది. ఈ హత్యకేసును లోతుగా దర్యాప్తు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలి' అని ఆ వీడియోలో ఆమె కోరారు.

తిరుపతి రైల్వే స్టేషన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

● సీపీఎం మాజీ ఎంపీ మధు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరిత గతిన పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తేవాలని సీపీఎం మాజీ ఎంపీ మధు డిమాండు చేశారు. తిరుపతిలోని తిరుపతిలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాన్ని అదానీ ప్రదేశ్‌గా ప్రభుత్వం మార్చేస్తోందని ఆరోపించారు. 'పట్టణ ప్రాంతాల్లో రోడ్లు, మంచినీటి సరఫరా, పారిశుధ్యం తదితరాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించి ప్రభుత్వం తీవ్ర నష్టం కలిగిస్తోంది. రాష్ట్రంలో రూ6400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయక 60 డిగ్రీ కళాశాలలు మూత పడ్డాయి. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఫీజ్ రీయింబర్స్‌మెంట్ చేస్తామన్న లోకేశ్ హామీ ఏమైంది? ఆరోగ్యశ్రీ పథకానికి రూ.మూడు వేల కోట్ల బకాయిలతో వైద్యం చేయలేమని ఆస్పత్రి యాజమాన్యాలు ప్రకటించాయి. విశాఖ స్టీల్ పక్కనే మరో ప్రైవేటు స్టీల్ ఫ్యాక్టరీకి అనుమతులివ్వడానికి, ఎంపీలచే గనులు కేటాయించమని సీఎం చంద్రబాబు కేంద్రం చుట్టూ తిరగడం దేనికి సంకేతం?' అంటూ కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేశారు.


మాట్లాడుతున్న సీపీఎం మాజీ ఎంపీ మధు

సైన్స్ టాలెంట్ సెర్చ్ పోటీల్లో ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గూడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతిలోని సైన్స్‌సెంటర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ సెర్చ్ పోటీల్లో చెన్నూరు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభచాటారు. జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక పాఠశాలలో పాఠశాల హెచ్‌ఎం బాలనాగమ్మ మాట్లాడుతూ తరుణ్‌కుమార్, ఆదిత్యా, నాహీద్‌అహ్మద్‌లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరాస్వామి, లోకేశ్వరి పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి


సబ్‌కలెక్టర్ ఆఫీస్ వద్ద దివ్యాంగ నాయకుల నిరసన

గూడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సమస్యలను పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వైసీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు మోహన్ అన్నారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద వైసీపీ దివ్యాంగుల విభాగం అధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశ్వారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల విభాగంలో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యాలయ ఏవో శిరీషకు వినతిపత్రంఅందజేశారు. కార్యక్రమంలో నాగేంద్ర, శుభాన్‌బాషా, ప్రభుదాస్, పోలయ్య, తులసి పాల్గొన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక


కార్తికేయను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చిల్లకూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు స్థానిక డాక్టర్ అంబేడ్కర్ గురుకులంలో 10వ తరగతి చదువుతున్న కార్తికేయ ఎంపికైనట్లు గు రుకులం ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్ తెలిపారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తెనాలిలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో అండర్-17 విభాగంలో కార్తికేయ ఉత్తమ ప్రతిభ కనబరిచాడన్నారు. కర్ణాటకలో ఈనెల 25 నుంచి 29వ వరకు జరిగే జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటాడన్నారు. హెచ్‌ఎం, పీడీ శ్రీరేష్, పీఈటీ రాజజేంద్ర, ఉపాధ్యాయులు ఆ విద్యార్థిని అభినందించారు.

ఆక్రమణలను అడ్డుకోవాలని వినతి


స్థానికులు ఇచ్చిన వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు

గూడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక విఘ్నేశ్వరపురం సమీపంలో మున్సిపాలిటీ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు కొందరు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని స్థానికులు కోరారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు విఘ్నేశ్వరపురం వాసులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించుకుని దుకాణాలను నిర్మించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అధికారులు విచారించి ఆక్రమణలను అడ్డుకోవాలని సందీప్, ఓంప్రకాష్, వంశీ తదితరులు కోరారు.

ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న గాంధీనాయుడు

నాయుడుపేట టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సీఎస్‌తేజ సెంటర్ వద్ద దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహం ఏర్పాటుకు పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కోట్లపాటి గాంధీనాయుడు లక్ష రూపాయల విరాళం ప్రకటించారు. ఈ మొత్తాన్ని టీడీపీ నాయకులు, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీకి సోమవారం అందజేశారు. అనంతరం గాంధీనాయుడు మాట్లాడుతూ విగ్రహ నిర్మాణ పనుల్లో భాగంగా స్టీల్ వర్క్‌కు ఈ నగదును అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుంటూరు లక్ష్మయ్య, ఈతముక్కల వెంకటసుబ్బానాయుడు, గుంటూరు లక్ష్మయ్య, గోపీ, రవి, తదితరులు ఉన్నారు.

రైతులకు యూరియా పంపిణీ



డక్కిలి, నంవంబర్ 24(ఆంధ్రజ్యోతి):స్థానిక రైతు భరోసా కేంద్రంలో దేవునివెలంపల్లి పంచాయతీకి చెందిన రైతులకు సోమవారం యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాదవాయపాలెం సింగిల్ విండో అధ్యక్షుడు ఏలేశ్వరం రామచంద్రానాయుడు మాట్లాడుతూ రైతులకు సమయానికి ఎరువులు అందేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. యూరియా కొరత అనేది వైసీపీ తప్పుడు ప్రచారమని విమర్శించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సహకారంతో రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ కిషోర్, వ్యవసాయ ఏవో శిరీష, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి నిర్ధారణ పరీక్షలు


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వెంకటగిరి, నవంబర్ 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాశీవిశ్వనాథ దేవస్థానం వద్ద సోమవారం పాతకోట సీహెచ్‌సీ ఆధ్వర్య ంలో కుష్ఠువ్యాధి నిర్ధారణా పరీక్షలు ని ర్వహించారు. వైద్యాధికారి రాజేష్ మాట్లాడుతూ జాతీయ కుష్ఠ వ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 30 వరకు పట్టణంలోని 14 సచ్చివాలయాల పరిధిలో కుష్ఠువ్యాధి మచ్చలపై సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏఎన్‌ఎంఎస్ సత్యవేణి, హైమావతి, రమణమ్మ ఉన్నారు.

ఉద్యోగాలకు 395 మంది ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో కళాశాల సిబ్బంది

గూడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గూడూరు, నెల్లూరుల్లో తమ కళాశాలలకు చెందిన 395 మంది విద్యార్థులు వివిధ కంపెనీల ఆధ్వర్యంలో జరిగిన క్యాంపస్ ఎంపికల్లో ప్రతిభ కనబరిచారని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విశ్వక్సేనారెడ్డి తెలిపారు. సోమవారం కళాశాలలో పలు కంపెనీల ఆధ్వర్యంలో క్యాంపస్ ఎంపికలు జరిగాయి. కార్యక్రమంలో వినయ్‌కుమార్, దత్తాత్రేయశర్మ, రాజేష్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

తడ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రైలు ఢీకొని ఓవ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసులు కథనం మేరకు అక్కంపేట రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం మధ్యాహ్నం రైలు పట్టాలను దాటుతున్న ఓ వ్యక్తిని అయోధ్య వెళ్తున్న శ్రద్ధసేతు ఎక్స్‌ప్రెస్ ఢీకొంది. గుర్తు తెలియని ఆ వ్యక్తి వెంటనే మృతి చెందాడు. మృతుడికి 25-30 సంవత్సరాల వయసుంటుంది. ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జీఆర్‌పీ పోలీసులు తెలిపారు.

29న టిడ్కో హౌసింగ్ రుణమేళా

నాయుడుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఈ నెల 29న టిడ్కో హౌసింగ్ రుణమేళా నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా ఓ ప్రకటనలో తెలిపారు. పాత బస్టాండ్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనంలో ఈ కార్యక్రమం జరగుతుందన్నారు. టిడ్కోలో 365, 430 చదరపు అడుగులకు సంబంధించి బ్యాంక్ రుణం పొందని ఇళ్ల లబ్ధిదారులకు ఈ రుణమేళా ఉపకరిస్తుందన్నారు. ఆధార్ కార్డు,పాన్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్కు, పాస్‌పోర్టుసైజు ఫోటోలు రెండు, టిడ్కో ఇళ్ల ఏర్పాటు పత్రం(ఒరిజినల్) వెంట తీసుకు రావాలని ఆయన సూచించారు.

వృద్ధులకు అన్నదానం

గూడూరు అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో సోమవారం ఇనుకుర్తి శ్రీనివాసులునాయుడు సహకారంతో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీహరి, శ్రీలక్ష్మీ, సునీల్, అమరయ్య, నరసింహులునాయుడు, వెంకటేశ్వర్లునాయుడు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు రావులపాడులో ఎమ్మెల్యే పర్యటన

పెళ్లకూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రావులపాడు గ్రామాన్ని మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ సందర్శించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతన్నా మీకోసం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, టీడీపీ శ్రేణులు, రైతులు పాల్గొన్నాలని కోరారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నాయుడుపేట టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట-శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ శ్రావణి (31) అనే మహిళ మృతి చెందినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. ఈ నెల 10న మోటారు సైకిల్‌ను కర్మాగారం బస్సు ఢీ కొన్న సంఘటనలో ఈమె తీవ్రంగా గాయపడింది. మెరుగైన వైద్యసేవల కోసం సిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు సీఐ పేర్కొన్నారు.

అర్జీలను పరిష్కరిస్తాం: ఆర్డీవో


అర్జీలు స్వీకరిస్తున్న కిరణ్మయి

సూళ్లూరుపేట, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి): ప్రజలు వివిధ సమస్యలపై గ్రీవెన్స్‌లో ఇచ్చే అర్జీలను పరిశీలించి పరిష్కరిస్తామని ఆర్డీవో కిరణ్మయి అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలో తొమ్మిది అర్జీలు వచ్చాయని పేర్కొన్నారు. గ్రీవెన్స్‌డే కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్‌డేకు ఒక అర్జీ వచ్చినట్లు తహసీల్దార్ గోపినాథ్ రెడ్డి తెలిపారు

ఏకగ్రీవంగా ఎన్జీవో కార్యవర్గ ఎన్నిక


కార్యవర్గంచేత ప్రమాణం చేయిస్తున్న సురేష్‌బాబు

సూళ్లూరుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవో అసోసియేషన్ తాలూకా ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. సోమవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో జరిగిన ఎన్నికల ప్రక్రియలో సూళ్లూపేట తాలూక ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడిగా నగుటూరు జనార్దన్, కార్యదర్శిగా అనుదీప్, ట్రెజరర్‌గా అరుణ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్లుగా కె.గిరిబాబు, రవికుమార్, రాకేష్, జాయింట్ సెక్రటరీగా ఎం.నాగరాజు, వెంకటేశ్వర్లు, వాసుదేవయ్య, మహిళా జాయింట్ సెక్రటరీగా బి.పుష్పలత, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కె.సాల్మన్ రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి శ్రావణ్ కుమార్ ప్రకటించారు. సహాయ ఎన్నికల అధికారిగా ఫణీంద్ర కుమార్, పరిశీలికులుగా లలిత్ కుమార్‌లు వ్యవహరించారు. నూతన కార్యవర్గ సభ్యులచే జిల్లా ఎన్జీవో అధ్యక్షుడు సురేష్‌బాబు ప్రమాణ స్వీకారం చేయించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కోట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని షిరిడీ సాయిబాబా మందిరంలో సోమవారం చెందోడుకు చెందిన ఎంవీరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. నెల్లూరు వాసన్ ఐకేర్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు రవికుమార్, ఈశ్వర్, పవన్‌లు రోగులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి దృష్టి లోపం ఉన్నవారిని గుర్తించారు. 25 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తామని ఎంవీరావు ఫౌండేషన్ ప్రతినిధులు లీలామోహన్, విజయలక్ష్మి తెలిపారు.

రేపు దివ్యాంగ క్రీడా పోటీలు

తిరుపతి(క్రీడలు), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): డిసెంబర్ 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లాస్థాయి దివ్యాంగ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు డీఎస్‌డీవో శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనివాస క్రీడా సముదాయం, ఎన్టీ తారకరామ మైదానం వేదికలలో బ్యాడ్మింటన్, చెస్, అథ్లెటిక్స్, లాంగ్‌జంప్, ఫుట్‌బాల్, వాలీబాల్ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు మరిన్ని వివరాల కోసం 9966882029, 9059606346లను సంప్రదించాలని కోరారు.

నైపుణ్యాలపై శిక్షణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పద్మావతి వర్సిటీ సోషల్ వర్క్ - క్లినికల్ సైకాలజీ విభాగం సంయుక్తంగా నైపుణ్య శిక్షణా కార్యక్రమం చేపట్టారు. ఇందులో నిపుణులు కౌన్సిలింగ్ ప్రక్రియలో అవసరమైన ప్రాథమిక నైపుణ్యాలపై శిక్షణ అందించారు. వినడం, పరిశీలన, సానుభూతి వంటి అంశాలతో పాటు ఎదుటి వారి ఆలోచనలను అంచనా వేయడంపై అవగాహన కల్పించారు. పలువురు అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యూరియా...ఈ తీరు బాగలేదయా..

● సాగులేని భూములకూ గుర్తింపు కార్డులా..? ● అధికారులకు కొందరు నాయకుల సిఫార్సులు


దామానెల్లూరు పరిధిలో ఫారెస్ట్ భూమికి ఇచ్చిన గుర్తింపు కార్డు


సూళ్లూరుపేటలో యూరియా తీసుకువెళ్తున్న రైతులు

సూళ్లూరుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): యూరియా గుర్తింపు కార్డుల్లో కొందరు వ్యవసాయశాఖ అధికారుల తీరు విమర్శలకు దారితీస్తోంది. సాగులో లేని, అటవీ, చెరువు, కాలువ పోరంబోకు భూములకు కూడా కార్డులను జారీ చేయడం ఇబ్బందులు కలిగిస్తోంది. ఫలితంగా అసలైన రైతులు నష్టపోతున్నారు. మంగళంపాడు, దామానెల్లూరు, మంగానెల్లూరు సచివాలయ పరిధిలో ఈ వ్యవహారం నడుస్తున్నట్లు తెలిసింది. రబీ సీజన్ అదును దాటిపోతోందని రైతులు యూరియా కోసం పడిగాపులు పడుతున్నారు. గుర్తింపు కార్డులున్న వారికే యూరియా అందజేస్తామనే నిబంధన వీరికి ప్రతిబంధకమైంది. దీంతో కార్డుల కోసం కార్యాలయాలు, నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. సాగు వివరాలు ఆధారంగా వ్యవసాయశాఖ అధికారులు గుర్తింపు కార్డులు జారీ చేయాలి. అయితే కార్డుల ప్రక్రియలో కొందరు అధికారులు ఒత్తిళ్లకు లొంగుతున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో కొందరు విస్తరణ అధికారులు పలుకుబడి ఉన్న రాజకీయ నాయకుల సిఫార్సు చేసిన వారికి సాగేతర భూములకు గుర్తింపు కార్డులను ఇచ్చేస్తున్నారని తెలిసింది. కొందరు నాయకులు నకిలీ కార్డుల ద్వారా యూరియా పొంది నిల్వచేసుకుంటున్నారనే విమర్శలున్నాయి. దీంతో చిన్న, కౌలు రైతులు నష్టపోతున్నారు. తాజాగా దామానెల్లూరు, మంగానెల్లూరు, ఉగ్గుముడి గ్రామాల్లో అటవీ భూములు కూడా సాగుగా గుర్తించి కార్డులు ఇచ్చారనే ఆరోపణలున్నాయి. ఆ కార్డుల ద్వారా సెంటు భూమిలేని వారు కూడా యూరియా తీసుకెళ్తున్నారు. మండలంలో మూడు విడతలుగా 22 మెట్రిక్ టన్నులు ఎరువు అందజేసినట్లు రికార్డులు చెబుతున్నా కొన్ని ప్రాంతాల్లో తమకు అందలేదని రైతులు అంటున్నారు. మరోపక్క ఇదే అదనుగా ప్రైవేట్ డీలర్లు ఇష్టానుసారంగా యూరియా అధిక ధరలకు విక్రయిస్తున్నారు. విక్రయాలపై పర్యవేక్షణ కరువైందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రైతన్నా మీకోసం కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు


రైతుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్


రైతులకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

గూడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం పోటుపాళెంలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతుల ఇళ్లను సందర్శించి ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ పథకాలపై అవగాహన కల్పించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 29 వరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. అన్నదాతసుఖీభవ పథకం ద్వారా ప్రభుత్వం మూడు విడతల్లో రైతులకు తోడ్పడుతోందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ గోపీనాయక్, పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ సురేష్, నాయకులు పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, మట్టం శ్రావణి, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొరవారిసత్రం: వేటగిరిపాళెంలో రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే విజయశ్రీ ప్రారంభించారు. వ్యసాయాధికారులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె రైతులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆలోచన విధానాలను రైతులకు వివరించారు. రసాయనిక ఎరువుల వాడకంను క్రమీప తగ్గించుకొంటూ రావాలని సూచించారు. రైతన్నకు అండగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ఆమె వివరించారు. కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు శైలాకుమారి, ఏవో జ్యోతిర్మయి, నాయకులు ముప్పాళ్ల శ్రీహరిరెడ్డి, విజయ్‌కుమార్, నాగేంద్రనాయుడు, మనోహర్‌రెడ్డి, ప్రమీలమ్మ, పామంజి వెంకట్ పాల్గొన్నారు.

ఏఎంసీ అభివృద్ధికి నిధులు కేటాయించండి


విజయ సునీతకు వినతిపత్రం అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ రమేష్

సూళ్లూరుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ మార్కెటింగ్ యార్డు అభివృద్ధికి సహకరించాని రాష్ట్ర వ్యవసాయశాఖ మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీతను ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్ కోరారు. గుంటూరు కార్యాలయంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. మార్కెటింగ్ యార్డు అభివృద్ధికి సంబంధించి పలు విషయాలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. సీసీ రోడ్లు లేవని, కార్యాలయంలో తగినంత సిబ్బంది లేరని, దొరవారిసత్రం మండలం ఏకొల్లులో ప్రభుత్వం కేటాయించిన భూమిలో గోదాలు నిర్మాణానికి సహకరించాలని వినతిపత్రం అందజేశారు. ఆయనతో పాటు దొరవారిసత్రం, ఓజిలి మండలాల టీడీపీ అధ్యక్షులు శ్రీనివాసుల నాయుడు, విజయకుమార్ నాయుడు ఉన్నారు.

ప్రజా దర్బార్‌లో అర్జీల స్వీకరణ


అర్జీని పరిశీలిస్తున్న కురుగొండ్ల రామకృష్ణ

బాలయపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి నెలకొన్న సమస్యల పరిష్కారానికే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌లో ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. 72 మంది తమ వినతులు అందజేశారు. వీటిలో రెవెన్యూపరంగా 32, అన్నదాత సుఖీభవకు సంబంధించి 19, పెన్షన్ల కోసం 21 అర్జీలు అందాయి. తహసీల్దార్ విజయలక్ష్మీ, ఎంపీడీవో నారాయణ, ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాథం, డీఆర్వో సుహాసిని, టీడీపీ మండల అధ్యక్షుడు రాయి సత్యనారాయణ, మస్తాన్‌నాయుడు, నాయకులు దాసరి ప్రభాకర్‌నాయుడు, రాజగోపాల్‌నాయుడు, సీసీ నాయుడు, నల్లబోతుల మురళి పాల్గొన్నారు.

సాగును లాభసాటిగా మార్చడమే లక్ష్యం


రైతులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఏవో వరప్రసాద్

పెళ్లకూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అధిక దిగుబడులు సాధించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యమని నాయుడుపేట వ్యవసాయశాఖ ఏడీఏ డాక్టర్ ఎం నాగార్జునసాగర్ పేర్కొన్నారు. సోమవారం కొత్తూరులో నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొన్ని మాట్లాడారు.. రైతులు లాభదాయకమైన ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించాలని ఆయన సూచించారు. జీలపాటూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శివకుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి విజయభారతి, ఏఈవోలు పుట్టయ్య, అశోక్ తదితరులు ఉన్నారు. **ఓజిలి** : పున్నేపల్లిలో రైతన్నా-మీకోసం కార్యక్రమాన్ని మండల ఏవో వరప్రసాద్ పర్యవేక్షించారు. ఇంటింటికి వెళ్ళి రైతులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. ఏఈఓ డెన్‌దీప్, వెటర్నరీ సహాయకులు షమీరా, ఇంజనీరింగ్ సహాయకులు పవిత్ర, వీఆర్వో డిల్లయ్య ప్రకృతి వ్యసాయం సిబ్బంది రైతులు పాల్గొన్నారు. **వాకాడు** : ఈనెల 29 వరకు సచివాలయ సిబ్బంది రైతులను కలిసి వ్యవసాయ సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తారని వ్యవసాయ అధికారి దీప తెలిపారు. సోమవారం ఆమె వాకాడు సచివాలయ పరిధిలో ఉన్న రైతులకు కరపత్రాలను అందజేశారు.

రైతు సంక్షేమానికి అగ్రాసనం

కోట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని టీడీపీ నాయకులు చెప్పారు. కొక్కుపాడులో సోమవారం టీడీపీ నాయకులు ఇంటింటా తిరిగి అన్నదాత సుఖీభవ కరపత్రాలను పంపిణీ చేశారు. సీఎం చంద్రబాబునాయుడు రైతుల పక్షపాతిగా సాహసోపేతమైన పథకాలు ప్రవేశపెట్టి దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను మొదటి స్థానంలో నిలుపుతున్నారన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, ఏఎంసీ చైర్మన్ మర్రిప్రమీల, మోహన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న చైతన్య, శ్యామ్ కుమార్, ఎంఈవో

సూళ్లూరుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు సమాజం పట్ల బాధ్యత, సేవాభావం అలవర్చుకోవాలని ఎన్‌ఎస్‌ఎస్ అధికారి చైతన్య అన్నారు. సోమవారం ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం సందర్భంగా జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో మన్నారు పోలూరు ప్రాథమిక పాఠశాలలోప్రత్యేక శిబిరం ప్రారంభించారు. శిబిరం ఏడు రోజుల పాటు జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ శ్యామ్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా పరిసరాలు శుభ్రత, సీజనల్ వ్యాధుల నివారణ చర్యల గురించి ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు వివరించారు. అనంతరం పరిసరాలను పిచ్చిమొక్కలు తొలిగించి పరిసరాలను శుభ్రం చేశారు. తడ మండలం కారిజాత లో ప్రిన్సిపాల్ ఎస్‌ఎల్‌బి శంకర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో సునీలా, ఆర్‌కే ఫౌండేషన్ నిర్వాహకులు రజనీకాంత్ పాల్గొన్నారు.

గోతుల రోడ్లను బాగు చేయాలి

బాలయపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బంగారుపేట నుంచి బాలయపల్లి పిగిలాం హస్తకావేరి గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా తయారయ్యాయి. దీంతో వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, చిన్న పెంచలయ్య అన్నారు. సోమవారం సీపీఐ నాయకులు స్థానికులతో కలసి రోడ్లను పరిశీలించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి బాగు చేయాలని వారు కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

కోట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వర్షాల నేపథ్యంలో చిన్నారులకు జ్వరాలు వంటి సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని సీడీపీవో మునికుమారి చెప్పారు. అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్‌లు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వెంకన్నపాళెం, తిమ్మానాయుడుపాళెం, వంజివాక అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. కాచిచల్లార్చిన నీటిని చిన్నారులకు ఇవ్వాలన్నారు. లోపాలు జరిగితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యవసాయ పథకాలపై శిక్షణ

కోట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం రైతన్నా మీకోసం వారోత్సవాలకు సంబంధించి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ మండలంలోని 13 రైతు సేవాకేంద్రాల పరిధిలో 9 కుటుంబాలను ప్రతి యూనిట్‌గా తీసుకొని అధికార బృందాలు అవగాహన కల్పిస్తాయన్నారు. రైతులకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న సంక్షేమ పథకాలు, అర్హత తదితర అంశాలపై ఇంటింటా ప్రచారం చేస్తారన్నారు. సమావేశంలో ఏవో సుచేంద్రప్రసాద్, ఎఫ్‌బీవో రెడ్యానాయక్ పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

తెలుగు భాష పరిరక్షణకు కృషి చేయండి

తిరుపతి అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా(పీఆర్‌ఎస్‌ఐ) ఆధ్వర్యంలో సమాజాన్ని చైతన్యపరిచేలా, అంతరించిపోతున్న తెలుగు భాషను పరిరక్షించేలా కార్యక్రమాలు నిర్వహించాలని ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్డీ విల్సన్ (శరత్‌చంద్ర) కోరారు. పీఆర్‌ఎస్‌ఐ తిరుపతి చాప్టర్ కార్యవర్గం సోమవారం పద్మావతి వర్సిటీ సావేరి విశ్రాంతి గృహంలో ఆయన్ను కలిసి సన్మానించింది. చాప్టర్ చైర్మన్ జి.ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాష పరిరక్షణకు అకాడమీ తరఫున కార్యక్రమాలు నిర్వహించేందుకు సంస్థ సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో పీఆర్‌ఎస్‌ఐ తిరుపతి చాప్టర్ వైస్ చైర్మన్ ఆచార్య ఎన్.రజని, కార్యదర్శి దుద్యాల చంద్రమోహన్, కోశాధికారి కె.మధుసూదన్, ఆర్జీ కృష్ణస్వామిరాజు, త్రిపురసుందరి, రవీంద్ర పాల్గొన్నారు.